## బహిరంగవేలంలో 5లక్షల10వేలకు మున్సిపల్ తైబజార్ కైవసం

**శామీర్‌పేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
మూడుచింతపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన తైబజార్ వేలంలో 5లక్షల10వేల రూపాయలకు అత్యధికంగా వేలంలో కావలి సందీప్ అనే అతను దక్కించుకున్నట్లు కమిషనర్ వెంకట గోపాల్ పేర్కొన్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకటగోపాల్, పలువురు కౌన్సిలర్ల సమక్షంలో తైబజార్ వేలంపాట జరిగింది. ఈ తైబజార్ బహిరంగ వేలంపాట పోటీలో కటికల వైద్యనాథ్, కావలి సందీప్‌లు మాత్రమే ఇద్దరు పాల్గొన్నారు. కావలి సందీప్ అత్యధికంగా 5లక్షల10వేల రూపాయలకు తైబజార్‌ను వేలంపాటలో దక్కించుకున్నట్లు కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. బహిరంగ వేలంపాటకు సంబంధించి సెప్టెంబరు 2వ తేదీన ఉత్తర్వుల జారీచేసి ప్రకటనను విడుదల చేయటం జరిగిందన్నారు. తైబజార్ దక్కించుకున్న కావలి సందీప్ మున్సిపాల్టీ నిర్ణయించిన నిబంధనల రేట్ల ప్రకారం ఫీజులు వసూల్ చేయాల్సి ఉంటుందని అధికారులు సూచించారు.



రంగారెడ్డి । వికారాబాద్ । మేడ్చల్
వార్త

## నిబంధనలు పాటించని ఓయోపై కేసు నమోదు

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
నిబంధనలను ఉల్లఘించిన ఓయో హోటల్‌పై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడ శ్రీనిధి నెస్ట్‌లో బైపాస్ రహదారి పక్కన ఉన్న ఓఆర్ఆర్ రెసిడెన్సీ ఓయోలో శనివారం ఘట్‌కేసర్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఓయో తనిఖీలలో కస్టమర్ల ఎంట్రీ, ఎగ్జిట్ వివరాల రిజిస్టర్ నిర్వహించకపోవడం, చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాల వివరాలు సేకరించకపోవడం, లావాదేవీలకు సంబంధించి రసీదుపుస్తకం నిర్వహించకపోవడం, టారిఫ్ /రేట్ లిస్ట్ ప్రదర్శించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు నిర్ధారించారు. సంస్థకు సంబంధించిన ఎంఎంసి అనుమతి/ట్రేడ్ లైసెన్స్, జిఎస్‌టి రిజిస్ట్రేషన్ వివరాలను నిర్వాహకులు సమర్పించకపోవడంతో తనిఖీ సమయంలో లభించిన ఒక రిజిస్టర్/నోట్‌బుక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ప్రజల భద్రత, నిబంధనల అమలులో భాగంగా సంబంధిత యజమాని/నిర్వాహకులపై చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఘట్ కేసర్ ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.

## గొట్లపల్లిలో వీధి దీపాల నిధుల్లో గోల్‌మాల్..!

**-ఒకరి పేరిట తీర్మానం.. మరొకరి ఖాతాలోకి బదిలీ..!**
**-తీర్మానం ఫోర్జరీ చేసి చెల్లింపులు చేశారంటూ ఎంపిడిఓ, ఎంపిఓకు ఫిర్యాదుచేసిన బాధితుడు**



సంబంధిత పత్రాలను ఎంపిడిఓకు అందజేస్తున్న నవీన్

**పెద్దేముల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగిన గ్రామపంచాయతీలో వీధిదీపాల ఏర్పాటుకు సంబంధించిన నిధుల చెల్లింపులపై వివాదం నెలకొంది. తన పేరిట గ్రామపంచాయతీ తీర్మానం చేసి, వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించిన పనికి తనకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇవ్వకుండా, ఇతరవ్యక్తుల పేరిట నిధులను మళ్ళించారని ఆరోపిస్తూ బాధితుడు ఎంపిడిఓ, ఎంపిఓలను ఆశ్రయించి దానికి సంబంధించిన పత్రాలను సమర్పించారు. వివరాలప్రకారం, పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామంలో వీధిదీపాల ఏర్పాటుకోసం ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామానికి చెందిన బంగారు నవీన్ పేరిట డిసెంబరు 12, 2025న తీర్మానం చేయగా, ఆయన డిసెంబరు 20 వరకు వీధి దీపాలను ఏర్పాటుచేశారు. ఇందుకు సంబంధించి జూన్ 20, 2025న బంగారు నవీన్ పేరిట రూ.29,916లు ఎంబి రికార్డు అయింది. అయితే బంగారు నవీన్‌కు రావలసిన రూ.29,916లను మాజీ పంచాయతీ కార్యదర్శి భార్య నార్ల మమత అకౌంటులో నిధులను జమచేశారు. తాను పనిచేసినా, ఇంతవరకు అమౌంట్ రాలేదని మేరి పంచాయతీ యాప్‌లో చెక్‌చేసుకోగా నార్ల మమత పేరిట నిధులు జమ అయినట్లు తెలిసింది. ఈవిషయాన్ని పంచాయతీ కార్యదర్శిని జులై 26న అడుగగా, ఇంకా అమౌంట్ రాలేదని, జిపిలో కూడా డబ్బులు లేవని సమాధానం ఇచ్చారు. తనకు రావలసిన అమౌంట్ వేరే ఇతర ఖాతాలోకి ఎందుకు మళ్ళింపులు చేశారని నిలదీయగా, ఆ అమౌంట్‌లో ఉపసర్పంచ్ రూ.10వేలు, పంచాయతీ కార్యదర్శి రూ.20వేలు ఇస్తానని ఒప్పుకున్నారని బాధితుడు పేర్కొన్నారు. ఇప్పటివరకూ వారు తనకు డబ్బులు ఇవ్వకపోవడంతో, ఈ విషయాన్ని జులై 31న ఎంపిడిఓ, ఎంపిఓలకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంబంధిత ఎంపిఓ ఆగస్టు 12న విచారణజరిపి, ఇందులో పంచాయతీ కార్యదర్శి తప్పిదం ఉందని ఆయనకు మెమో జారీచేసారని బాధితుడు తెలిపారు. నోటీసులు పంచాయతీ కార్యదర్శికి ఒక్కరికే ఇచ్చి, తమకు ఎందుకు ఇవ్వకుండా విచారణచేపట్టారని బాధితుడు ఆరోపించారు. తనకు రావలసిన అమౌంట్‌ను ఇతరులకు ఎందుకు బదిలీచేశారని అడుగగా, టెక్నికల్ ఇష్యూవల్ల పేమెంట్ బదిలీ అయిందని సంబంధిత అధికారులు చెబుతున్నారని బాధితుడు ఆరోపించారు. దీంతో బాధితుడు నవీన్ ఆర్‌టిఐ సమాచారం కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు, ఈ-గ్రామ్‌స్వరాజ్ వెబ్‌సైట్‌లో చూడగా అందులో సర్పంచ్, ఉపసర్పంచ్ సంతకాలతోపాటు బెనిఫిషియర్ పేరు ఉన్నట్లు తెలిసింది. నోట్‌ఫైల్‌లో సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో సంతకాలతో పాటు బంగారు నవీన్‌కు పేమెంట్ చేసినట్లు ఉంది. ఇందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉపసర్పంచ్ కలిసి ఫోర్జరీ చేసినట్లు వెల్లడైందని బాధితుడు తెలిపారు. ఈవిషయంలో ఫోర్జరీ చేసి డబ్బులను దుర్వినియోగం చేసినవారిపై చట్టరీత్యా చర్యలుతీసుకొని, తనకు రావలసిన అమౌంట్‌ను ఇప్పించగలరని నవీన్ విజ్ఞప్తిచేశారు. గ్రామ పంచాయతీ నిధులు ప్రజాధనం కావడంతో వాటి వినియోగంలో పారదర్శకత తప్పనిసరి. బాధితుడు చేసిన ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**ఎంపిఓ వివరణ...**
ఒకరికి రావలసిన అమౌంట్‌ను ఇతర ఖాతాలోకి ఎందుకు బదిలీ చేశారని ఎంపిఓ రతన్‌సింగ్‌ను వివరణ కోరగా, ఈవిషయంలో పంచాయతీ కార్యదర్శి తప్పిదం ఉండటంతో ఆయనకు మెమో జారీ చేసినట్లు ఎంపిఓ తెలిపారు.

## దక్షిణ తెలంగాణను అవమానిస్తే సహించం



ఆమనగల్లులో దిష్టిబొమ్మను దగ్ధంచేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**ఆమనగల్లు, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీపై అక్కసుతోనే బిఆర్ఎస్ పార్టీ అడ్డుకునేందుకు కుట్రలకు కుటిల ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం అన్నారు. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తానని కెటిఆర్, హరీశ్‌రావులు వ్యాఖ్యానించడం దక్షిణ తెలంగాణపై ఆపార్టీకున్న స్ట్రాటజీకి నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ రద్దు వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అధ్యక్షుడు అవ్వారి శివలింగం ఆధ్వర్యంలో శనివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులతో కలిసి కెటిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈమేరకు అవ్వారి శివలింగం మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీలో ఫ్యూచర్ లేదంటూ కెటిఆర్, హరీశ్‌రావు మాట్లాడటం దక్షిణ తెలంగాణ ప్రజలను అవమానించడమేనని మండిపడ్డారు. ఈప్రాంతానికి చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఫ్యూచర్ సిటీతో పాటు దక్షిణ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దావ ధనంజయ, కాలే మల్లయ్య, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, గాజుల సురేష్, అబ్దుల్ అలీమ్, వగ్గు మహేష్, కండె సాయి, అండేకర్ రాజు, శ్రీపాల్, హరిలాల్, కొండల్‌రెడ్డి, సురేష్‌నాయక్, దేవరశెట్టి మహేష్, నాజర్, యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ ప్రధాన రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, దుద్దు కృష్ణయాదవ్, పూసల వెంకటేష్, శ్రీనునాయక్, అంజాత్, ఫిరోజ్, మజీద్ పాల్గొన్నారు.

## యంగ్ టైటన్స్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభించి పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి

**శామీర్‌పేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
లాల్‌గడిమలక్‌పేట్‌లోని సిఎంఆర్ స్కూల్ ప్రాంగణంలో యంగ్ టైటన్స్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ 2026పోటీలను మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి ప్రారంభించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలోని సిఎంఆర్ స్కూల్ ప్రాంగణంలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాకారులుగా రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో లాల్‌గడిమలక్‌పేట్ గ్రామ మాజీ సర్పంచ్ సి.శ్రీనివాస్‌రెడ్డి, మండలాల నాయకులు జి.మల్లేశ్‌గౌడ్, మోహన్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, టి.అనిల్‌రెడ్డి, కౌన్సిలర్ గుర్క కుమార్‌యాదవ్, మరికొందరు నాయకులు బి.రాంరెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**-మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగావర్**
**-శామీర్‌పేట పెద్ద చెరువును సందర్శించి పరిశీలించిన జోనల్ కమిషనర్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, కీసర డిసి రామలింగం, అధికారులు**



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ జోనల్‌కమిషనర్ సంచిత్‌గంగావర్

**శామీర్‌పేట, సెప్టెంబరు 12, ప్రభాతవవార్త:**
వినాయక నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లుచేయాలని, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించటానికి, నిమజ్జన ప్రాంతంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగావర్ ఆదేశించారు. శనివారం శామీర్‌పేట పెద్దచెరువులో వినాయకుల నిమజ్జనంకోసం ఏర్పాట్లు జరుగుతున్నందున ఆయన జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, కీసర డిప్యూటీ కమిషనర్ రామలింగం, ట్రాఫిక్ సిఐ పవన్‌కుమార్‌రెడ్డి, పలువురు అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగావర్ చెరువులోని నిమజ్జన ప్రాంతాన్ని, చెరువు ప్రాంగణం పరిసర ప్రాంతాలను సందర్శించి నిమజ్జన కార్యక్రమం ఏర్పాట్లపై ఆరాతీసి అధికారులతో సమీక్షించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా జరిగే వినాయకుల నిమజ్జనం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు, ప్రజలు పెద్దచెరువుకు తరలివచ్చే అవకాశం ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో ఏర్పాట్లుపూర్తిచేయాలన్నారు. ప్రజల రాకపోకలకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో అవసరమైన క్రేన్లు, బారికేడ్స్, లైటింగ్, త్రాగునీటి సౌకర్యం, పారిశుధ్యం ఏర్పాట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితితులు ఏర్పడినపుడు వెంటనే స్పందించేలా సంబంధితశాఖల అధికారులు, సిబ్బంది సహాయ బృందాలను అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. విద్యుత్, రహదారి, పారిశుధ్యం, పోలీసు, ట్రాఫిక్‌పోలీసు తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలుతీసుకోవాలన్నారు. శామీర్‌పేట పెద్దచెరువుతో పాటు పోతాయిపల్లి చెరువు, దేవరయాంజాల్ చెరువులను కూడా అధికారుల, ప్రజాప్రతినిధులు పరిశీలించి ఆయాప్రాంతాల్లో నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేయాలని జోనల్ కమిషనర్ సంచిత్ గంగావర్ అన్నారు. కార్యక్రమంలో వారితోపాటు డిఈ మాదవచారి, ఏఈ నీరిషారెడ్డి, నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్, పలువురు సంబంధితశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రంథాలయ సెస్ బకాయిలు చెల్లించాలి

**-మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
జిల్లాలోని మున్సిపాల్టీల వద్ద పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలు చెల్లించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సంబంధిత అధికారులకు సూచించారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ సమీక్షాసమావేశం అదనపు కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. దీనిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సురేశ్‌బాబు, మున్సిపాల్టీల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లాపరిధిలో గ్రంథాలయ సెస్ వసూల్, పెండింగ్ బకాయిలు మున్సిపాల్టీల అధికారులు చెల్లించాలని గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలన్నారు. స్థానిక సంస్థల నుంచి గ్రంథాలయ సెస్‌ను సకాలంలో వసూలు చేసి జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలన్నారు. మున్సిపాల్టీల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రాధాన్యతతో చెల్లించాలన్నారు. బకాయిలు ప్రతి నెల 2లక్షలరూపాయల చొప్పున చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధిత మున్సిపల్ అధికారులు అంగీకరించి నిర్ణీత విధానంలో బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు. ప్రతి మున్సిపాల్టీ క్రమంతప్పకుండా గ్రంథాలయ సెస్‌ను అందజేయాలని నిర్ణయించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గతంలో ప్రతి నెల 5లక్షల గ్రంథాలయ సెస్ చెల్లించబడుతుండగా, ఏప్రిల్ 2026నుంచి ఇప్పటివరకు ఇంతవరకు సెస్ అందలేదని చర్చించారు. వెంటనే ఆ పెండింగ్ సెస్ నిధులు విడుదల చేయాలని లేఖలు రాయాలని నిర్ణయించారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి రూ.4కోట్లు గ్రంథాలయ సెస్ వసూలు చేయాలని బడ్జెట్‌లో లక్ష్యంగా నిర్ణయించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 2026 నుంచి ఆగస్టు 2026 వరకు స్థానిక సంస్థల నుంచి రూ.5కోట్లకు పైగా గ్రంథాలయ సెస్ వివిధసంస్థల నుంచి వసూలు కావటం పట్ల సమావేశంలో సంతృప్తిని వ్యక్తం చేశారు.
అధిక మొత్తంలో గ్రంథాలయ సెస్‌ను వసూల్ చేయటానికి అన్ని స్థానిక సంస్థలు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ అభివృద్ధి, సెస్ వసూల్, పలు అంశాలపై సమీక్షించారు. గ్రంథాలయాల్లో పాఠకులకు సౌకర్యాలు పెంచేలా తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేశ్‌బాబు, పలువురు మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 165 ట్రాఫిక్ కేసుల పరిష్కారం

**-రూ.2.56 లక్షల జరిమానా**

**మేడ్చల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మేడ్చల్‌లోని అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో మేడ్చల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని మొత్తం 165 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులను పరిష్కరించబడ్డాయి. అందులో మద్యం సేవించి వాహనాలు నడిపిన 112 కేసులకు రూ. 2,03,000ల జరిమానా విధించగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 53 కేసులకు గాను రూ. 53,000ల జరిమానా విధించినట్లు మేడ్చల్ ట్రాఫిక్ సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. మొత్తం రూ. 2,56,000 జరిమానా విధించగా మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో 29 మందికి కోర్టు జైలు శిక్ష విధించిందని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రాణాలకే ప్రమాదమని, వాహనదారులు తప్పనిసరిగా రవాణా నియమాలను పాటించాలని ట్రాఫిక్ సీఐ కోరారు.

## రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
రైలు పట్టాలపై ఒగుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఘట్‌కేసర్ ఎస్ఐ సికింద్రాబాద్ రైల్వేపోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని వ్యక్తి శవం ఉందని శనివారం గుర్తించారు. జిఆర్‌పి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా 45 నుంచి 50 సంవత్సరాలు కల్గిన వ్యక్తి శవం గుర్తు పట్టలేని విధంగా కుళ్లిపోయి ఉందని పురుగులు పట్టాయని తెలిపారు. రైలు నుంచి కింద పడి గాని రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉంటాడని తెలిపారు. మృతుడు సిమెంట్ రంగు టీషర్ట్, బూడిద రంగు నిక్కరు ధరించి ఉన్నాడని 5.7 అడుగుల ఎత్తు, చామనుచాయగా ఉన్నాడని ఏలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, గుర్తు తెలియని శవం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని, గుర్తు తెలిసిన వారు పోలీసు సెల్: 9440083160, 8712658581 లకు సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

**శంషాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్44పై అగర్వాల్ ఎస్టేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనలో ఓ ఉద్యోగి మృతి చెందాడు. సిఐ సురేంద్ రెడ్డి వివరాల ప్రకారం..శంషాబాద్ పరిధిలోని పాత మదన్‌పల్లి తండాకు సుమారు 200 మీటర్ల దూరంలో ఉదయం 11.30 గంటల మధ్య ఈ ఘటన చోటుచేసుకుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న సయ్యద్ జహీరుద్దీన్ అహ్మద్ (57) తన ఓలా స్కూటీ (టిఎస్ 11 ఈజెడ్0038)పై విధులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం అతివేగంగా, నిర్లక్ష్యంగా స్కూటీని ఢీకొట్టింది. దీంతో ఆయన రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు.ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

## కిష్టాపూర్‌లో కారు బీభత్సం

**-బైక్, కారు, నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన బ్రేజా కారు**
**-ఇద్దరికి తీవ్ర గాయాలు**




ప్రమాదానికి కారణమైన బ్రెజా కారు

**మేడ్చల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
మేడ్చల్ మండల పరిధి కిష్టాపూర్ గ్రామంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. రావల్‌కోల్ చౌరస్తా నుంచి మేడ్చల్ వైపు వెళ్తున్న బ్రేజా కారు కిష్టాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో అదుపు తప్పి వరుసగా మూడు వాహనాలను ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం ప్రకారం హీరా సింగ్ (46) అనే వ్యక్తి నడుపుతున్న బ్రేజా కారు ముందుగా ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టి అనంతరం షిఫ్ట్ డిజైర్ కారును డీకొట్టింది. అంతటితో ఆగకుండా సమీపంలో నిలిపి ఉంచిన అశోక్ లేలాండ్ వాహనాన్ని కూడా ఢీకొట్టినట్లు తెలిసింది. ఈ వరుస ప్రమాదంతో సంఘటనా స్థలంలో ఒక్కసారిగా కలకలం రేగింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే డ్రైవర్ మద్యం సేవించాడా? లేక ప్రమాదానికి ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది. స్థానికులు స్పందించి కారు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108 అత్యవసర అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ఎలా జరిగింది? కారు అదుపు తప్పడానికి అసలు కారణం ఏమిటి? డ్రైవర్ మద్యం సేవించాడా లేదా? అనే అంశాలపై పోలీసుల విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి రానున్నాయి.

## మంత్రి సీతక్కను కలిసిన మహిళా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు

**-మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన జిల్లా మహిళాసర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు తిప్పని మాధవిరామ్‌రెడ్డి**



మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలుపుతున్న తిప్పని మాధవిరామ్‌రెడ్డి

**చేవెళ్ల, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను రంగారెడ్డి జిల్లా మహిళా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు తిప్పని మాధవిరామ్‌రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం పోరం అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను కలిశారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతోగానో సర్పంచ్‌లకు మేలు జరిగిందని జిల్లా మహిళా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు తిప్పని మాధవిరామ్‌రెడ్డి అన్నారు.
తెలంగాణరాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70, సబ్‌సెక్షన్ (3) ప్రకారం గ్రామ పంచాయతీల నిధులను ట్రెజరీలో కాకుండా నేరుగా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ ఇటీవల, సెప్టెంబర్ 10, 2026న అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం కీలక సవరణ చేయడం పట్ల జిల్లా మహిళా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు తిప్పని మాధవి రామ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్యకు రంగారెడ్డి జిల్లా సర్పంచ్‌ల సంఘం తరపున తిప్పని మాధవి రామ్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పంతాలకు పోకుండా రాజీ మార్గాన్ని ఎంచుకోవాలి

**-జిల్లా న్యాయసేవా చైర్మన్ లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్**



కక్షిదారులతో మాట్లాడి రాజీ కుదుర్చుతున్న న్యాయమూర్తులు

**వికారాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
పంతాలు పట్టింపులకు పోకుండా కక్షిదారులు రాజీ మార్గాన్ని ఎంచుకుని లోక్ అధాలత్‌లో రాజీ పడినట్లైతే ఇరుపక్షాలవారు గెలిచినట్టేనని జిల్లా న్యాయసేవాచైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. శనివారం వికారాబాద్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ కోర్టులలో నిర్వహించిన లోకాదాలత్‌లో మొత్తం 7,353 కేసులు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఇందులో భూములకు సంబంధించిన కేసులు 26, క్రిమినల్ కేసులు 3,714, ప్రిలిటిగేషన్ 3613 కేసులు పరిష్కరించబడ్డాయని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకి ఒకసారి నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండువర్గాలు కూర్చుని మాట్లాడుకుని కేసులను తొలిగించుకునే అవకాశం జాతీయన్యాయసేవాచట్టం1987 తీసుకురావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపున్యాయమూర్తి ప్రదీప్‌నాయక్, న్యాయసేవ సెక్రటరీ, న్యాయమూర్తి రాధిక, సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి శాంతి లత, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వైష్ణవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు లవకుమార్, ఉపాధ్యక్షులు వసుంధర, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, పిపిలు మేరజ్, పెర్దోషు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలకు పల్లె బ్రదర్స్ భారీ విరాళం



**కేశంపేట సెప్టెంబరు 12 ప్రభాతవార్త**

కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలకు పల్లె బ్రదర్స్ అండగా నిలిచారు. గ్రామంలోని వివిధ వినాయక మండపాల నిర్వాహకులు, యువకులను ప్రోత్సహిస్తూ పల్లె బ్రదర్స్‌లో ఒకరైన పల్లె బాలేశ్వర్ రూ.2.50 లక్షలను చందా రూపంలో అందించారు. ఈ సందర్భంగా పల్లె బాలేశ్వర్ మాట్లాడుతూ గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించాలని యువకులకు, మండపాల నిర్వాహకులకు సూచించారు. హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. విరాళం అందించిన పల్లె బ్రదర్స్‌కు వినాయక మండపాల నిర్వాహకులు, యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పామ్ విజేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శివకుమార్, సూరం శేఖర్, బుర్రి మల్లేష్ గౌడ్, వార్డు సభ్యుడు బండ మల్లేష్ యాదవ్, వివిధ యువజన సంఘాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

**బిజెపి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు మహేష్**



**కేశంపేట సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మీద లేని సోయి అరెస్టుల మీద ఉందని భారతీయ జనతా పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్ తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు, ప్రజలకు ఉంటుందని అన్నారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి ఇది ఒక నిదర్శనమని మండిపడ్డారుఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఆ హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోంది" అని కంచుకోట మహేష్ ఆరోపించారు.నిరుద్యోగులు, రైతులు, మహిళలు, యువత, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని అన్నారు.10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగించిందో, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు.ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం ద్వారా ప్రజా ఉద్యమాలను అణచివేయలేరని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తీరుతామని కంచుకోట మహేష్ స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై భారతీయ జనతా పార్టీ మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. ముందస్తు అరెస్టు లో బీజేవైఎం సాంస్కృతిక విభాగం కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి, రాకేష్,శివ, సందీప్,రాజు, శివాజీ నాయకులను అరెస్టు చేశారు.

## మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం..

**ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములమవుదాం : తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**

**కేశంపేట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**

వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కేశంపేట తాజా మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పిలుపునిచ్చారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందుకే పర్యావరణ హితమైన మట్టి గణపతులను పూజించడమే ఉత్తమమని అన్నారు.భక్తి, సంప్రదాయాలతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మట్టి గణపతుల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచి, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కోరారు.

## గోమాతను పూజిస్తే సమస్త దేవతలను పూజించినట్లే

**చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్ట శ్రీ జగన్నాథస్వామి మందిర్ మఠంలో ఏర్పాటు చేసిన గోశాలను తమిళనాడుకు చెందిన మధుర్‌కావే వానమామలై రామానుజ జీయర్ స్వామీజీ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఆలయ అర్చక స్వాముల మంత్రోచ్ఛారణల మధ్య కాశీ పీఠాధిపతి శ్రీమత్ జగద్గురు రామానుజాచార్య స్వామి రుగ్వేదాచార్యజీతో కలిసి గోవులకు ప్రత్యేక పూజలు చేసి పచ్చి గ్రాసం తినిపించారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ సర్వదేవతా స్వరూపిణియైన గోమాతను పూజిస్తే సమస్త దేవతలను పూజించినట్లేనన్నారు. గోమాత స్పర్శ రోగాలను హరిస్తుందని, గోసేవ ముక్తిని ప్రసాదిస్తుందని తెలిపారు. గోవులను సంరక్షించటం, గోసేవ చేయటం మానవ జన్మకు సార్థకత లభిస్తుందన్నారు. అంతకుముందు మఠంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి, శ్రీ బలభద్రుడు, సుభద్ర, జగన్నాథ స్వామి, శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అర్చక స్వాములు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో నిర్వాహకులు దామోదర్‌దాస్ గోవింద్ కుమార్ లోహియా, చంగ్‌మల్ ప్రమోద్ కుమార్, అర్చకు లు సంజయ్ పాండే, జ్యోతిధర్ సింగ్, ఎం.ప్రభాకర్‌రాజ్ ముది రాజ్, పాల్వాయి సాయికిరణ్, మధు సింగ్, గీతా సింగ్ పాల్గొన్నారు.

## ఘనంగా ఐఐఆర్ఎం స్నాతకోత్సవం

**హైదరాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త**

భీమా నియంత్రణ అభివృద్ధి అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ),తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ (ఐఐఆర్ఎం) స్నాతకోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ అజయ్ సేథ్, పట్టభద్రులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను మరియు ప్రత్యేక కోర్సులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడుతూ భారతదేశ భీమా మరియు రిస్క్ మేనేజ్‌మెంట్ రంగంలో విస్తరిస్తున్న ఉద్యోగ అవకాశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. వేగంగా మారుతున్న ఈ పరిశ్రమలో నిపుణులు విజయం సాధించడానికి నిజాయితీ, సాంకేతికత, ఆవిష్కరణలు మరియు నిరంతర అభ్యాసం చాలా కీలకమని ఆయన నొక్కి చెప్పారు. భీమా రంగంలోని మానవ కోణాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, భీమా వ్యవస్థలో సానుభూతి కేంద్రంగా ఉండాలని, "అందరికీ భీమా" సాధించడానికి మరియు విక్సిత్ భారత్ దార్శనికతకు దోహదపడటానికి ఇది అత్యవసరం అని చెప్పారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కుమార్ శుక్లా మాట్లాడుతూ సాంకేతికతను సద్వినియోగం చేసుకోండి, కానీ మానవ విచక్షణను వదులుకోవద్దు అని పట్టభద్రులను ఆయన కోరారు.

## మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పాటు ప్రమాదకర రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను పూజించి చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా నిమజ్జనం అనంతరం అవి సహజంగా నీటిలో కలిసిపోయే అవకాశం ఉండటంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు.వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మట్టి గణపతుల వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, పర్యావరణహితమైన వినాయక చవితి వేడుకలకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కవాడిగూడ డీసీ పుష్పలత, బన్సీలాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు నామన సంతోష్ కుమార్, కొండాపురం మహేష్ యాదవ్, మహేందర్ గౌడ్, వెంకటరమణ, లక్ష్మీపతి, గులాబ్ సింగ్, అభిషేక్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆరెకపూడి గాంధీ

**మియాపూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్, అభయాంజనేయ కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ హైటెన్షన్ లైన్ రోడ్డు, శ్రీల గార్డెన్ కాలనీల్లో మొత్తం రూ.2 కోట్ల 84 లక్షల 50 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి గాంధీ శనివారం శంకుస్థాపన చేశారు.మయూరి నగర్‌లోని కోరుకొండ కోచింగ్ సెంటర్ సమీపంలోని పార్కులో రూ.60.50 లక్షలతో సీసీ రోడ్డు, ఓపెన్ జిమ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. అభయాంజనేయ కాలనీలో రూ.23 లక్షలతో ఓపెన్ జిమ్, శ్రీల గార్డెన్ కాలనీలో రూ.46 లక్షలతో ఓపెన్ జిమ్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్-బొల్లారం రోడ్డు నుంచి హైటెన్షన్ లైన్ రోడ్డులోని కోకోనట్ గ్రూప్స్ అపార్ట్‌మెంట్స్ వరకు రూ.1.55 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించనున్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రోడ్ల నిర్మాణంతో స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కాలనీలో పార్కులు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే తన లక్ష్యమని గాంధీ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలబెడతామని గాంధీ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ ఆశాజనకంగా మారుతోంది : ఛైర్మన్ రాఘవరావు



బిల్డర్ల సమావేశంలో మాట్లాడుతున్న గ్రేటర వెస్ట్‌సిటీ బిల్డర్ స్ అసోసియేషన్ ఛైర్మన్ రాఘవరావు,

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

రియల్ ఎస్టేట్ రంగంలో ప్రస్తుతం ఇబ్బందులున్నా, మరో రెండేళ్లలో ఉవ్వెత్తున ఎగసిపడుతుందని గ్రేటర్ వెస్ట్‌సిటీ బిల్డర్స్ అసోసియేషన్ ఛైర్మన్ మిరియాల రాఘవరావు అన్నారు. గ్రేటర్ వెస్ట్‌సిటీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని శుభం గ్రాండ్ వేదికగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ ఛైర్మన్ మిరియాల రాఘవరావు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రస్తుతం రియల్ మార్కెట్ అధ్వానంగా ఉన్నందువలన బిల్డర్లు, మార్కెట ఒడిదుడుకులను తట్టుకుంటూ భవిష్యత్తు మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని స్థలాలను కొనుగోలు చేసుకుని పెట్టుకుంటే రాబోయే మరో రెండేళ్లలో రియల్ ఎస్టేట్ ఉవ్వెత్తున పెరుగుతుందన్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగాన్ని 22ఏ అంశం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లుగా ఆయన వాపోయారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ కే.రాజారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం 22ఏ పై సత్వరం దృష్టిపెట్టి బిల్డర్ల సమస్యలను, అదే విధంగా గృహ యజమానుల వేదనను తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన జనరల్ శెక్రటరీ విశ్వనాథ్ మాట్లాడుతూ.. బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన తరపున ఎప్పటికప్పుడు నివేదిస్తూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రస్తుతం 22ఏ సమస్యలు, అదే విధంగా జీహెచ్ఎంసీ,హెచ్ఎండిఏల ద్వారా అనుమతులు పొందిన లేఅవుట్లలో కూడా 22ఏ వలన కలుగుతున్న ఇబ్బందులపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వానికి అత్యంత అదాయాన్ని సమకూరుస్తున్న నిర్మాణ రంగం నిర్వీర్యం కాకుండా కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ వైస్ ఛైర్మన్ సమ్మెట ప్రసాద్ మాట్లాడుతూ.. చిన్న బిల్డర్లు సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యలను వెల్లడించుకునేందుకు ఓ వేదికగా గ్రేటర వెస్ట్‌సిటీ బిల్డర్స్ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. సమిష్టిగా పోరాటం చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రియల్‌ఎస్టేట్ వాయపారి బాణాల రాంరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని అసోసియేషన్ సభ్యులు మౌనం పాటించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని కాపాడాలని సభ్యులు కోరారు. ఈ సమావేశంలో వెస్ట్‌సిటీ బిల్డర్లు దాదాపు 120 మందికిపైగా సమావేశమయ్యారు.

## ఆంధ్రనాట్య, పేరిణి రీతులను ముందంజలో ఉంచాలి : నాట్యాచార్యులు కళాకృష్ణ



నృత్య కళాకారులను సత్కరిస్తున్న ప్రముఖ ఆంధ్ర నాట్య గురువు కళాకృష్ణ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త :** ఆంధ్ర నాట్య ప్రఖ్యాత గురువు, పద్మశ్రీ నటరాజ రామకృష్ణ పునరుద్ధరించిన ఆలయ నాట్య రీతిని, పేరిణి నృత్య సంప్రదాయాన్ని భావితరాలకు అందించేలా గురు పరంపర కొనసాగాలని ప్రముఖ ఆంధ్ర నాట్య గురువు కళాకృష్ణ ఆకాంక్షించారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ఖిలాస్య రంజని నాట్య సంస్థఖి ఆధ్వర్యంలో నాట్య గురువు రేఖ గరిసనకుర్తి శిష్య బృందం ప్రదర్శించిన ఆలయ నర్తనం, ఆస్థాన నాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాకృష్ణ మాట్లాడుతూ... నటరాజ రామకృష్ణ ఎంతో పరిశోధన చేసి రూపకల్పన చేసిన ఆంధ్ర నాట్యంలో శిక్షణ పొందిన కళాకారులు, ఆ సంప్రదాయ కళను తమ శిష్యులకు అందిస్తూ ముందుకు తీసుకెళ్తుండటం అభినందనీయమన్నారు. నాట్య గురువు రేఖ కూడా నటరాజ రామకృష్ణ పర్యవేక్షణలోనే ప్రతిభావంతమైన కళాకారిణిగా తీర్చిదిద్దబడ్డారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రముఖ హరికథా విద్వాంసురాలు ఉమామహేశ్వరితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పేరిణి నాట్య గురువు పవన్ సమర్థవంతంగా వ్యాఖ్యానం అందించగా, శిష్య బృందం నృత్య ప్రదర్శనలు కన్నులవిందుగా సాగాయి.

## సీఎస్ఐఆర్‌యూజీసీ నెట్‌లో ఈశ్వర్ కుమార్ సత్తా..

**-జాతీయ స్థాయిలో 42వ ర్యాంకు..**

**దుండిగల్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహించిన జాయింట్ సీఎస్ఐఆర్‌యూజీసీ నెట్ జూన్ 2026 ఫలితాల్లో నగరానికి చెందిన ఆరకల ఈశ్వర్ కుమార్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్ విభాగంలో ఆల్ ఇండియా 42వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఈ ఫలితంతో ఆయన సీఎస్ఐఆర్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హతను పొందారు. 200 మార్కులకు నిర్వహించిన పరీక్షలో ఈశ్వర్ కుమార్ 138.400 మార్కులు సాధించి 98.86 పర్సంటైల్ నమోదు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీమైసమ్మకు చెందిన ఆరకల రాజ్‌కుమార్, రమాంజన దంపతుల కుమారుడైన ఈశ్వర్ కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జియాలజీలో పీజీ పూర్తి చేశారు. డిగ్రీ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి ఉస్మానియా విశ్వవిద్యాలయం గోల్డ్ మెడల్ సాధించారు. విద్యాభ్యాసంతో పాటు పరిశోధన రంగంలోనూ ఆసక్తి కనబరిచిన ఈశ్వర్ కుమార్ ప్రతిష్ఠాత్మక ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ), సీఎస్ఐఆర్‌నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐఓ) వంటి సంస్థల్లో రీసెర్చ్ ఇంటర్న్‌గా పనిచేశారు. జాతీయ స్థాయిలో 42వ ర్యాంకు సాధించి జేఆర్ఎఫ్, ప్రొఫెసర్ అర్హత పొందిన ఈశ్వర్ కుమార్‌ను కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, మిత్రులు అభినందించారు.

## గుభాళించిన కామేశ్వరి జీవిత జ్ఞాపకాల మొగిలిపూల గాలి



**రవీంద్రభారతి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ప్రముఖ రచయిత్రి చెంగల్వల కామేశ్వరి రచించిన జ్ఞాపకాలే జీవిం నవలిక, మొగిపూల గాలి కథాసంపుటిల సుగంధాలు రవీంద్రభారతిలో గుభాళిస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి చమత్కరించారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ రచయిత్రి, లేఖిని అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు డా. ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, కె.ప్రవీణ్‌కుమార్, డా. వంశీరామరాజు, మాశర్మ తదితరులతో కలిసి చెంగల్వల కామేశ్వరి రచించిన మొగలిపూల గాలి కథాసంపుటి, జ్ఞాపకాలే జీవితం నవలికలను ఆవిష్కరించారు. అనంతరం రచయిత్రి కామేశ్వరి జ్ఞాపకాలే జీవితం నవలను పద్మావతి నాగరాజారావు దంపతులకు, మొగలిపూల గాలి కథాసంపుటిని డా. ఐఎస్ఆర్.రావు, ప్రభావతి దంపతులను ఘనంగా సన్మానించి తొలి ప్రతులను అందించి అంకితం కావించారు. సందూరి సుందరీ నాగమణి, సరస్వతి పుస్తకాలను పరిచయం చేశారు. చివరి రచయిత్రి తన స్పందనను తెలిపారు.

# డిగ్రీ దండగ కాదు.. పండగ

**-ఏవియేషన్, సముద్ర భద్రత, రక్షణ రంగాల్లో కోర్సులు**

**-రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి**



అవంతి కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి. చిత్రంలో అవంతి శ్రీనివాసరావు, ప్రొ.వెంకటరమణ, అవంతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. ప్రియాంక తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త**

దేశ జనాభాలో దాదాపు 50 శాతం మంది 26-27 ఏళ్ల లోపు యువతే ఉన్నారని, వారికి నాణ్యమైన విద్యతో పాటు సరైన ఉపాధి మార్గదర్శకత్వం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. యువత విద్యను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని, అందుకే రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తూ గ్రాడ్యుయేషన్ స్థాయిలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని ఆయన తెలిపారు. శనివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్యహాల్‌లో అవంతి కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు డిగ్రీ పట్టాలను వారు అందజేశారు. డిగ్రీ విద్యలో మార్కెట్ ఆధారిత సంస్కరణలు తీసుకొస్తున్నామని, డిగ్రీ దండగ కాదు.. పండగ అనే నినాదాన్ని నిజం చేస్తూ, మూడేళ్లు లేదా నాలుగేళ్లు చదివిన వెంటనే విద్యార్థులకు కొలువులు లభించేలా గత ఏడాది కాలంగా కసరత్తు చేసి సరికొత్త సిలబస్‌ను సిద్ధం చేసినట్లు చైర్మన్ వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సరికొత్త కోర్సులను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రవేశపెడుతున్న నయా కోర్సులు: బీబీఏ డిఫెన్స్, ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్స్ ఎయిర్‌లైన్ మేనేజ్‌మెంట్ బీబీఏ మ్యారిటైమ్ సెక్యూరిటీ, సైబర్ సెక్యూరిటీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సెక్యూరిటీ స్టడీస్ ఇప్పటికే కొన్ని కళాశాలల్లో సెక్యూరిటీ స్టడీస్ ప్రారంభించామని, రానున్న విద్యా సంవత్సరం నుంచి ఏవియేషన్, సముద్ర భద్రత, రక్షణ రంగాలకు అవసరమైన నైపుణ్య కోర్సులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అవంతి విద్యాసంస్థ చైర్మన్, మాజీ మంత్రి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, కొత్త కోర్సుల ద్వారా తెలంగాణను దేశానికి దిక్సూచిగా నిలిపేందుకు తమ విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. వెంకటరమణ, ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీ విజయ్ చరణ్, వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ మోడీ, అవంతి గ్రూప్స్ ఆఫ్ కాలేజెస్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ ప్రియాంక, వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ మోడీ, టైమ్స్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ డొమినిక్ గాడ్‌ఫ్రెడ్, అవంతి గ్రూప్స్ విద్యాసంస్థల డైరెక్టర్ వై. జయప్రద, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మిద్దె తోటలు.. పర్యావరణ పరిరక్షణకు ప్రజా ఉద్యమం

**-700 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**



**హైదరాబాద్ సెప్టెంబర్ 12,ప్రభాతవార్త :**

నగరాల్లో పచ్చదనాన్ని పెంచుతూ, ప్రతి ఇంటినీ చిన్న అర్బన్ ఫార్మ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో శనివారం పర్యావరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 700 మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే కూరగాయలు, పూలు, సుగంధ, ఉపయోగకరమైన మొక్కలను సిటిజి సభ్యులకు అందజేశారు.ప్రతి ఇంటా మిద్దె తోట.. ఇంటింటా ఇంకుడు గుంట" అనే నినాదంతో పచ్చదనం, స్వచ్ఛమైన ఆహారం, వర్షపు నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని సిటిజి పిలుపునిచ్చింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. రాజి రెడ్డి మాట్లాడుతూ.. కాంక్రీట్ నగరాల్లోనూ మిద్దెలు, బాల్కనీలు, చిన్న స్థలాలను పచ్చని ఉత్పాదక ప్రాంతాలుగా మార్చుకోవచ్చన్నారు. మిద్దె తోటల ద్వారా కుటుంబాలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు అందడంతో పాటు నగరాల్లో పచ్చదనం పెరుగుతుందని తెలిపారు. అర్బన్ ఫార్మింగ్ విస్తరణకు హార్టికల్చర్ యూనివర్సిటీ తరపున సాంకేతిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.హెచ్ఎండిఎ మేనేజర్ వీజీ సుందర్ మాట్లాడుతూ పట్టణ పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు సిటిజి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. దిగిబి మిద్దె తోటల కార్యక్రమాన్ని అభినందిస్తూ మొక్కల సహకారం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కరివేపాకు, గోరింటాకు, పుష్పించే మొక్కలను సభ్యులకు అందజేశారు.మట్టి వినాయక విగ్రహాలు పర్యావరణానికి మేలు చేస్తాయని సిటిజి ప్రతినిధులు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల విగ్రహాలకు బదులుగా సహజ మట్టి విగ్రహాలను వినియోగించాలని సూచించారు. భక్తి ఉండాలి.. ప్రకృతిపై బాధ్యత కూడా ఉండాలి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కార్యక్రమం లక్ష్యమన్నారు.ఇది ఒక్క కార్యక్రమం కాదని, ప్రతి కుటుంబం పర్యావరణ పరిరక్షణను రోజువారీ జీవితంలో భాగం చేసుకునేలా చేయడమే సిటిజి లక్ష్యమని ప్రతినిధులు తెలిపారు. ఒక్క ఇంటితో ప్రారంభిద్దాం.. ప్రతి ఇంటికీ తీసుకెళ్దాం" అని పిలుపునిచ్చారు

## విద్యుత్‌ని వృధా చేయకుండా పొదుపుగా వాడాలి : మేడ్చల్ డీఇ జాన్

**హైదరాబాద్, సెప్టెంబరు12ప్రభాతవార్త :**

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వినియోగదారులు సహకరించి ,విద్యుత్ వినియోగంలో తగు జాగ్రత్తలు తీసుకుని పొదుపుగా వాడాలని మేడ్చల్ డీఈ జాన్‌ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల జలశయాలు తగిన స్థాయిలో నిండకపోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయిన దృష్ట్యా వినియోగదారులు వినియోగంలో తగు జాగ్రతలు తీసుకోవాలని డీఇవిజ్ఞప్తిచేశారు. దీని కారణంగా విద్యుత్ ఉత్పత్తి తగ్గి ప్రస్తుతం ఉన్న అధిక విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ సరఫరా చేయడంలో ఇబ్బందులుతలెత్తుతున్న దృష్ట్యా వినిగదారులు సహకరించి, అవసరం లేని సమయంలో విద్యుత్‌ని వాడకుండా విద్యుత్ వినియోగం వృధా కాకుండా అవసరానికి అనుగుణంగా విద్యుత్‌ని పొదుపుగా వాడి సహకరించాలని డీఇ జాన్ కోరారు.

## సంగీతం మనిషి మానసిక ఒత్తిడిని తగ్గించే మంచి ఔషధం

**ప్రాగ్నిక ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రవీణ్**



ప్రముఖ గాయకులు తాడేపల్లి సాయి ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రాగ్నిక ఫౌండేషన్ వ్యవస్థాపకులు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:**

సంగీతం మనిషి మానసిక ఒత్తిడిని తగ్గించే మంచి ఔషధమని ప్రాగ్నిక ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రవీణ్ అన్నారు. శనివారం సిటీ కల్చరల్ సెంటర్ వారి కళాభారతిలో నెల్లూరుకు చెందిన శారద సీతారామ్ ఆధ్వర్యంలో శారదా సురాగాలు మొదటి వార్షికోత్సవం సందర్భంగా నెలవంక తొంగి చూసింది అనే పేరుతో సంగీత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పారిజాత, ప్రవీణ్‌లు హాజరై, గాయనీ గాయకులను శాలువాలతో, జ్ఞాపికలతో సత్కరించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగిన ఈ సంగీత విభావరిలో పలువురు గాయనీ గాయకులు తమ గాత్రంతో అలరించారు. గౌరవ అతిధిగా త్రినాథ్ పోల, ఆత్మీయ అతిథిగా ప్రముఖ గాయకులు తాడేపల్లి సాయిప్రసాద్‌లు హాజరై, వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సంగీత కార్యక్రమంలో సింహ, జీఎస్ఎన్, సురేష్ కడలి, నెల్లుట్ల అమర్‌నాథ్, దేవాన్షి, వికాస్ బుర్రి, చందన లాస్య, ఖేయామృత పాల్గొనగా హరిత తన వ్యాఖ్యానంతో అందరినీ ఆకట్టుకున్నారు.

## పాతనగరంలో ఘనంగా తెలంగాణ విమోచన జైత్ర యాత్ర



తెలంగాణ విమోచన జైత్ర యాత్రలో పాల్గొన్న ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మహేశ్వరం బిజెపి ఇంఛార్జి అందెల

**చార్మినార్,సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** బాలాపూర్ శివాజీ చౌక్ నుంచి చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరం వరకు శనివారం మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన జైత్ర యాత్ర ఘనంగా జరిగింది.పాతబస్తీలోని చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరం వరకు కొనసాగిన తెలంగాణ విమోచన జైత్ర యాత్రలో నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు,కార్యకర్తలు బైక్‌లతో ర్యాలీలో పాల్గొన్నారు. చార్మినార్‌కు జైత్రయాత్ర చేరుకున్న అనంతరం చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి,మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములుతో పాటు పలువురు బిజెపి నాయకులు చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.త్రివర్ణ పతాకాలను పట్టుకుని దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు దేశ ఐక్యత,జాతీయ సమైక్యత, సంఘటిత శక్తిని చాటి చెప్పారు.మహేశ్వరం బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు మాట్లాడుతూ తెలంగాణ విమోచన పోరాట చరిత్రను నేటి యువతకు,భావి తరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతోనే జైత్ర యాత్రను నిర్వహించామని తెలిపారు.తెలంగాణ విమోచన దినోత్సవ విశిష్టతను ప్రతీ ఒక్కరికి తెలియజేయటంతో పాటు హైదరాబాద్ భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని భావితరాలకు గుర్తు చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఇంటిలెక్టువల్ సెల్ కన్వీనర్ గంగాపురం వెంకట్ రెడ్డి,మాజీ జిల్లా అధ్యక్షులు బొక్కా నరసింహారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి,రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి,భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు నిరంజన్ యాదవ్,గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు ఉమా మహేందర్,తో పాటు బిజెపి నాయకులు బిజెవైఎం నాయకులు,హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనాలకు పత్తికుంట సిద్ధం

**-శాశ్వత షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్**



**అత్తాపూర్ సెప్టెంబరు 12,ప్రభాతవార్త :**

వినాయక నిమజ్జనోత్సవాలకు పత్తి కుంట సిద్ధమైంది. పత్తి కుంట వద్ద వినాయక కొలను ముస్తాబు చేశారు. చెరువు వద్ద రూ. 12 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మాణం ఏర్పాటు చేశారు. షెడ్డును శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, గణేష్ ఉత్సవ సమితి నాయకులతో కలిసి ప్రారంభించారు. భక్తులు, అధికారులు నిలబడటానికి ప్రతి సంవత్సరం తాత్కాలిక టెంట్ లు , షామియానాలు వేసే చోట ఈ సంవత్సరం రూ. 12 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మాణం చేసినట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిలు తెలిపారు. పత్తి కుంట మంచినీటి చెరువని ఈ చెరువులో ప్రతి సంవత్సరం వేలాది వినాయకుల నిమజ్జనాలు జరుగుతుంటాయని తెలిపారు. పత్తి కుంట వినాయక కొలను వద్ద విద్యుత్ దీపాలు, క్రేన్ల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, నిమజ్జనం జరిగే వినాయక ప్రతిమలను ఎప్పటికప్పుడు తొలగించడం లాంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. వినాయక చవితి, నిమజ్జోనో త్సవాలను ప్రజలు, భక్తులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేటట్లు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ జోనల్ ఈఈ నరేందర్ గౌడ్, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధి లు వై. శ్రీధర్ , సామ ఇంద్రపాల్ రెడ్డి, బొక్క బాల్ రెడ్డి, ఎన్ మల్లారెడ్డి, పడమటి శ్రీధర్ రెడ్డి, ఎస్ విజయ్ కుమార్, పలుగుచెరువు మహేష్, రగడంపల్లి శ్రావణ్, ధనుంజయ,వేణు గోపాల్, పెండ్యాల సాయి మల్లిక్ పాల్గొన్నారు.

## నిరంజన మఠంలో ఘనంగా ఆరాధనోత్సవాలు

**కొడంగల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

కొడంగల్ పట్టణంలోని నిరంజన మఠంలో శ్రీగురు బసవలింగేశ్వర స్వామివారి ఆరాధనోత్సవాలు వీరశైవ సంఘం అధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.శ్రావణమాసం ముగింపు సందర్భంగా మఠంలో బసవలింగేశ్వరుడికి విశేషఅలంకరణలతో అర్చకులు గడ్డం చంద్రశేఖరస్వామి, విజయకుమార్‌లు ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, మహమంగళ హారతి, స్వామివారి పల్లకిసేవ తదితర పూజలు నిర్వహించారు. ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న నిరంజనమఠ్ సంస్థాన్ జగద్గురు డాక్టర్ సిద్దలింగమహాస్వామి భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు అందించారు. ప్రతి ఒక్కరు దైవచింతనను అలవర్చుకుంటు పరోపకారంతో ముందుకు వెళ్ళాలని పిలుపునిచ్చారు. అనంతరం మఠంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆరాధనోత్సవాల్లో వీరశైవసమాజ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## భాద్రపద మాసం మొదటిరోజు పూజలు

**షాద్‌నగర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో భాద్రపద మాసం మొదటిరోజు పురస్కరించుకొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు అర్చనలు నిర్వహించి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ మాసంలో ఒంటి పూట భోజనం చేస్తే ధన సమృద్ధి ఆరోగ్యం ప్రాప్తిస్తాయి. ఉప్పు, బెల్లం దానాలు కూడా ఈ మాసంలో విశేషఫలితాన్ని ఇస్తాయి. శుద్ధచవితిన ఆదిదేవుడైన వినాయక ఆవిర్భావం జరిగిన ఈరోజు గణపతి పూజ ఉపవాసం వంటివి విశేష ఫలితాలు ఇస్తాయి. అన్ని మాసాలో కల్లా ఈ భాద్రపద మాసం విశేషంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ మాసంలో పితృతర్పణాలు మనకు దైవ సమానులైన తల్లిదండ్రులకు తర్పణాలు అర్పిస్తారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు, సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మలగారి సత్యనారాయణ, 12వ వార్డ్ కౌన్సిలర్ కళ్యాణ్ దిలీప్ కుమార్, మాజీ కౌన్సిలర్ ఈగ వెంకట్రాంరెడ్డి, కానుగు అనంతయ్య,మాజీ కోఆప్షన్‌మెంబర్ ఒగ్గు కిషోర్, పట్టణతెలుగుదేశం అధ్యక్షుడు గంధం ఆనంద్ కుమార్, ఆర్యవైశ్యనాయకులు యంసాని శ్రీనివాస్, అంతటి కోటిలింగం గౌడ్, ఆలయ మేనేజర్ రాజగోపాల్, అర్చకులు సంతోష్‌కుమార్, రవిశర్మ, సునీల్, కిరణ్‌శర్మ, గణేష్, శివ, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఫోటో 05 శివ మారుతి ఆలయంలో జరిగిన పూజల పాల్గొన్న దృశ్యం

## పర్యావరణ పరిరక్షణకు మట్టివినాయకులను ప్రతిష్ఠించాలి

**-మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ కుమార్**

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

పర్యావరణ పరిరక్షణకు విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ప్రతిష్టించాలని ఘట్‌కేసర్ మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కె.వినోద్ కుమార్ అన్నారు. పోచారం డివిజన్ చౌదరిగూడ వెంకటాద్రీ టౌన్‌షిప్ కాలనీ కమ్యూనిటీ హాలు వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయకులను పంపిణీచేశారు. ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతూ పర్యావరణానికి హానికల్గించే రసాయన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ప్రతిష్టించడం ద్వారా చెరువులు, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత వహించాలని అన్నారు. మట్టి వినాయకుడు మన సంప్రదాయానికి ప్రతీక పర్యావరణ పరిరక్షణకు మనబాధ్యతకు నిదర్శనమని అన్నారు. ఈసందర్భంగా కాలనీవాసులకు మట్టివినాయకులను పంపిణీచేశారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులనే పూజంచాలి



మట్టి వినాయకులను పంపిణీచేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, పావనిజంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

పర్యావరణ హితం కోసం మట్టి వినాయకులనే పూజించాలని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ చౌరస్తాలో శనివారం ప్రజలకు మట్టివినాయక ప్రతిమలను పంపిణీచేశారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా అధికారులు మట్టివినాయకులను తయారుచేయించి మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల చేతులమీదుగా ప్రతిమలను అందజేశారు. పీఓపీద్వారా రసాయన రంగులతోచేసిన విగ్రహాలను చెరువులు, కుంటలు, కాలువల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కాలుష్యమై పర్యావరణానికి హాని కల్గడంతో పాటు జలచరాలకు ప్రాణాలకు నష్టం వాటిల్లుతుందని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో కీసరగుట్ట డైరక్టర్ సగ్గు అనిత శ్రీనివాస్, గడ్డిఅన్నారం ఎఎంసీ డైరక్టర్ చిల్కూరి మచ్చేందర్‌రెడ్డి, డిసిసి కార్యదర్శి మామిండ్ల ముత్యాల్ యాదవ్, మాజీకార్యదర్శి ఉల్లి అంజనేయులు, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కడపోల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, మాజీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు గోరకంటి రవీందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## సింగల్ విండో చైర్మన్ పదవి ఇవ్వండి

**-కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు డేవిడ్**

**తలకొండపల్లి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల సింగల్ విండో చైర్మన్ పదవి తమకు ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు మిన్నాల డేవిడ్ తెలిపారు. తలకొండపల్లి మండలంలోని గట్టుప్పలపల్లి గ్రామానికిచెందిన మిన్నాల డేవిడ్ మండలంలో కాంగ్రెస్‌పార్టీకి సీనియర్ నాయకునిగా పనిచేస్తున్నానని గతంలో కమ్యూనిస్టు పార్టీలో కీలకంగా పనిచేసిన తాను ఎంతోమంది నిరుపేదల తరఫున ఉద్యమాలునిర్వహించానని, ప్రస్తుతం కల్వకుర్తిఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నందున తమను గుర్తించి చైర్మన్‌పదవి ఇవ్వాలన్నారు. తలకొండపల్లి మండలంలో ఇప్పటివరకు దళితవర్గానికి సింగల్ విండో చైర్మన్ పదవి ఇవ్వలేదని, మండలంలో ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీలో సీనియర్ దళితనాయకునిగా కొనసాగుతున్నానని, ఇప్పటివరకు ఎలాంటి నామినేట్ పదవులు తీసుకోలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి చొరవ తీసుకొని సింగల్ విండో చైర్మన్గా తమకు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## మట్టి గణపతిని పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం

**-మట్టి వినాయక విగ్రహాలు ఉచిత పంపిణీ**



విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసిన టిజిపిసిబి అధికారుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

వినాయకచవితి పండుగను పురస్కరించుకుని మట్టిగణపతిని పూజిద్దాం. పర్యావరణాన్ని కాపాడుదాం అనేనినాదంతో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని పలుప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాలను టిజిపిసిబి మేడ్చల్ జిల్లా అధికారులు ఉచితంగా పంపిణీ చేశారు. శనివారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని జీడిమెట్లలోని ఇంస్ట్రీస్ అసోసిషియేషన్ భవనంలో, బాలానగర్ బీబీఆర్ ఆసుపత్రి సమీపంలో, కూకట్‌పల్లిలోని మెట్రోస్టేషన్ సమీపంలో, బోధి సత్యస్కూల్ కుత్బుల్లాపూర్ సుభాష్‌నగర్‌లో, కొంపల్లిలో, ఆనంద్‌బాగ్‌లో, రాంపల్లిలో, నాగారంలో మట్టి వినాయకులను తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం మేడ్చల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ బి.రాజేందర్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. వినాయకచవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకోసం మట్టివినాయకవిగ్రహాలను ఉచితంగా అందజేయటం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ప్రజలకు మట్టివినాయకవిగ్రహాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. ప్రజలు పర్యావరణహిత పద్ధతుల్లో వినాయక చవితి పండుగను నిర్వహించాలని టిజిపిసిబి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

## విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

**-ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**తాండూరు, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయుల చేతిలోనే దేశభవిత ఆధారపడి ఉందని, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని తులసిగార్డెన్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, మండల విద్యాధికారి ఇందుప్రియ, ఉపాధ్యాయసంఘాల నాయకులు, వివిధపాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ, మంచి నడవడికను నేర్పించి ఉన్నతంగా ఎదిగేందకు ఉపాధాయులు ఎంతగానో కృషిచేస్తారని కొనియాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో సహాకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం సమాజశ్రేయస్సుకు కృషిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**-రావులపల్లి సర్పంచ్ గోటూరి రామచెంద్రయ్యగౌడ్**

**చేవెళ్ల, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రావులపల్లి సర్పంచ్ గోటూరి రామచెంద్రయ్య గౌడ్ పిలుపు నిచ్చారు. రావులపల్లి గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల సర్పంచ్ గోటూరి రామచెంద్రయ్య గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రావులపల్లి సర్పంచ్ గోటూరి రామచెంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందే అవకాశం ఉందన్నారు,రావులపల్లి గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనూష అంజన్‌కుమార్, పిఏసిఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్, వార్డుసభ్యులు మల్లేశ్వరి హనుమంత్‌గౌడ్, జ్యోతివెంకటేష్, జైపాల్‌రెడ్డి, కుమ్మరి గోపాల్, ఎం.రమేష్, ఎస్.నర్సింలు, జి.కుమార్, గ్రామపెద్దలు, లబ్ధిదారులు, యువకులునాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీలు రద్దుచేయాలని సర్పంచ్‌లు వినతి

**తలకొండపల్లి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

రాష్ట్రప్రభుత్వం గ్రామాలలో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నాడు పలువురు సర్పంచుల ఆధ్వర్యంలో తలకొండపల్లి ఎంపీడీవో సీతారామమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ల సంఘం మండల గౌరవ అధ్యక్షులు మాకం వీరేశలింగం, అధ్యక్షులు కటికల శేకర్‌యాదవ్ మాట్లాడుతూ మండలంలోని ఆయాగ్రామాలలో సర్పంచ్‌గా ఎన్నిక కాబడిన వారిని కాదని అభివృద్ధి పనులు ఇందిరమ్మ కమిటీల పేరుతో సర్పంచుల హక్కులను కాలరాయటం జరుగుతుందని, చట్టబద్ధంగా ఎన్నికైన సర్పంచులతో అభివృద్ధి పనులు నిర్వహించాలని , అన్ని గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీలను పూర్తిగా రద్దుచేసి ప్రజలచేత ఎన్నుకోబడిన సర్పంచులతో గ్రామాలలోని అభివృద్ధిపనులు నిర్వహించాలని అవినీతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం మండల గౌరవ అధ్యక్షులు మాకం వీరేశలింగం , అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, సర్పంచులు సుధాకర్, మల్లేష్ సొల్లు రంగమ్మ ,వానరాశి రాములమ్మ, నిర్మల శ్రీశైలం యాదవ్, పుష్పమ్మ అంజన్ రెడ్డి, శేఖర్ యాదవ్, దేవి కృష్ణ నాయక్, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్దులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృంధం

**కొడంగల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

విద్యార్దులు విద్యతోపాటు క్రీడారంగాల్లో రాణించాలని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు.మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల దౌల్తాబాద్,కళాశాలలో విద్యార్దులు 70వ ఎస్‌జిఎఫ్ ఖోఖో టోర్నమెంట్,కొడంగల్ జోనల్‌లో నిర్వహించిన ఆటపోటీల్లో బీసీ గురుకుల పాఠశాల విద్యార్దులు ఖోఖో అండర్=17 విభాగంలో ద్వితీయ బహుమతిని పొందారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్దులు క్రీడారంగంలో రాణించడం ద్వారా విద్యార్దులకు ధైర్య సాహాసాలు పెరుగుతాయని గెలుపు ఓటములు సహజమని తెలిపారు.అదేవిధంగా పలువురు విద్యార్దులు జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగిందన్నారు.వారిలో అండర్17 విభాగంలో హర్షవర్ధన్, వేణు, హరి, అఖిలేష్, అండర్14 విభాగంలో కాంత్, రవి, మనోజ్ ఎంపికైనట్లు తెలిపారు.వీరిని పాఠశాల బృంధం శనివారం అభినందించారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, కావ్య, లక్ష్మణ్, నరేష్, అనిల్, విట్టల్, సంగప్ప, రాములు, రాధా, అఖిల్, రవి, చక్రవర్తి, నరేందర్, రాములు, సరోజ, వెంకట్, లక్ష్మి, శరత్, సుమలత, స్వాతి, సంతోష్, కిరణ్, అనిల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం..100 యూనిట్ల రక్త సేకరణ

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయసేవాపథకం (ఎన్ఎస్ఎస్), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 100 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి రెడ్‌క్రాస్‌సొసైటీ ప్రతినిధులు సేకరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్లు మాట్లాడుతూ రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. శిబిరాన్ని విజయవంతం చేసిన రక్తదాతలు, రెడ్‌క్రాస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈకార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.జానకి రాములు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివకేశవరెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.నరసింహారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఎం.హరి ప్రసాద్, కె.అనిల్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం మెరుగైన సదుపాయాలు కల్పిస్తుందని మాజీ ప్రజాప్రతినిధులు తెలిపారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని మండలపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాజీ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా స్కూల్ డ్రెస్, బెల్టులు పంపిణీ చేశారు. పాఠశాలకు విద్యార్థులకు డ్రెస్‌లు సరఫరా కావడంతో వారు విచ్చేసి విద్యార్థిని, విద్యార్థులకు అందజేశారు. టీచర్లు బోధించిన విధంగా శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులు తెచ్చుకోవాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, మాజీ ఉపసర్పంచ్ ఎలసాని అయిలయ్య, మాజీ వార్డుసభ్యులు కంచర్ల వెంకట్‌రెడ్డి, డొంకెన శంకర్‌గౌడ్, నాయకులు పెద్దొళ్ల సాయిలు, ముద్దం మల్లేశ్‌యాదవ్, బట్ల భాస్కర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టంచేయాలి

**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపు**



నియామక పత్రాలను అందజేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**చేవెళ్ల, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. ఇటీవల ఎంపికైన మూడు మున్సిపల్ అధ్యక్షులు, ఐదు మండలాల అధ్యక్షులకు చేవెళ్ల ఏమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో శనివారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు నియామక పత్రాలను అందజేశారు. చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షులు చంద్రమోళి, చేవెళ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, నవాబ్‌పేట్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, షాబాద్ మండల అధ్యక్షులు పెంటారెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షులు వెంకటరెడ్డిలకు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ పార్టీకి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు తమపరిధిలో కాంగ్రెస్‌పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని అన్నారు. గ్రామాలు, వార్డులస్థాయిలో పార్టీశ్రేణులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈసందర్భంగా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు బి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ సమతా వెంకటరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ ప్రస్తుత కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి, చేవెళ్ల పి ఎస్ ఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి ఆగిరెడ్డి, చేవెళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్,శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్ మాజీ సర్పంచ్ లు పడాల ప్రభాకర్, రవీందర్, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, చేవెళ్ల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి సోషల్‌మీడియా కోఆర్డినేటర్ మహేశ్వర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశాంత్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎంపిడివోతోనే ముగించిన మండల సర్వసభ్యసమావేశం

**తలకొండపల్లి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సీతారామమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావలసి ఉండగా, కొంతమంది అధికారులుమాత్రమే హాజరై తమ నివేదికలను మండల సమావేశానికి సమర్పించారు. మండలంలోని సర్పంచులు అందరూ సర్పంచులు అందరూ పాల్గొని పాల్గొని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కటికల శేఖర్ యాదవ్కు వేదికపై అవకాశం ఇవ్వాలని కోరగా అందుకు ఎంపీడీవో సీతారామమ్మ తిరస్కరించారు. దాంతో బి ఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, రాంపూర్ సర్పంచ్ కటికల నిర్మల శ్రీశైలం యాదవ్, చుక్కాపూర్ సర్పంచ్ వీరేష్ లింగం, మాదాపల్లి సర్పంచ్ సుధాకర్, వెల్జాల్ సర్పంచ్ వానరాశి రాములమ్మ, చంద్రదన సర్పంచ్ సొల్లు రంగమ్మ, ఆర్య నాయక్ తండ సర్పంచ్ లక్ష్మి, తుమ్మలకుంట సర్పంచ్ దేవి తోపాటు మరికొంతమంది టిఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు మండల సమావేశాన్ని బహిష్కరించి సర్పంచులు మండల సమావేశాన్ని బహిష్కరించి బయటికి బయటికి వెళ్లిపోయారు. అనంతరం మండల ఎంపీడీవో సీతారావమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి మండల విద్యాధికారి, డాక్టర్ వెటర్నరీ, విద్యుత్‌ఏఈలు రాకపోవడంతో మండలంలోని నల్లరాళ్లకుంటతాండ సర్పంచ్ శ్రీనునాయక్, లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డిలు తమ తమ గ్రామాలలో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని ఎన్నిసార్లు అధికారులకు తెలిపిన ఫలితం లేదని సభ దృష్టికి తెచ్చారు. మండల డిప్యూటీ తాసిల్దార్ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో నూతనంగా 14వేల పైచిలుకు నూతన స్మార్ట్ రేషన్‌కార్డులు మండలంలో నూతనంగా 14వేల పైచిలుకు నూతన స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరయ్యాయని ఇంకా రేషన్‌కార్డు రానివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నందున నోటీస్ అందినవారు డాక్యుమెంట్ను అందజేసి ఓటు కోల్పోకుండా చూసుకోవాలని సభా డాక్యుమెంట్ను అందజేసి ఓటుకోల్పోకుండా చూసుకోవాలని సభకు తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ తమ నివేదికలను సభ దృష్టికి తెచ్చారు. అనంతరం ఎంపీడీవో సీతారామమ్మ. పలు అంశాలతో కూడిన విషయాలను సర్పంచులకు అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రాజేంద్రరెడ్డి, మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని, వైద్యాధికారులు స్నేహ, ఏపీఎం రామస్వామి, సర్పంచులు కాసు శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్ శేఖర్ శేఖర్ తోపాటు గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సత్యప్రసాద్ ఎన్నిక ఏకగ్రీవం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సత్యప్రసాద్ (మేడ్చల్ జిల్లా) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడు రోజుల పాటు యాదగిరిగుట్టలో జరిగిన ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సత్యప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ మండలం మల్లాపూర్‌కు చెందిన సత్యప్రసాద్ మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావటం పట్ల పలువురు ఏఐవైఎఫ్ శ్రేణులు హర్షం వ్యక్తంచేశారు. ఆయన గతంలో 2004 లో ఎఐఎస్ఎఫ్ కాప్రామండల కార్యదర్శిగా, 2010లో ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుగా రెండు సార్లు బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి ఉద్యమంలో అనుభవంను గుర్తించి యువజన ఉద్యమంలో తీసుకవెళ్లటం జరిగిందని, 2017లో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా, 2020లో మరోసారి జిల్లా అధ్యక్షులుగా, 2023లో ఎఐవైఎఫ్ మేడ్చల్‌జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించినట్లు తెలిపారు. యువతసమస్యలపై నిరంతరం ఉద్యమ కార్యక్రమాలు చేపట్టారు. ఈ ధీర్ఘకాలిక ఉద్యమ ప్రస్థానానికి గుర్తింపుగా రాష్ట్ర మహాసభలు సత్యప్రసాద్‌ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకోవటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గతంలో విద్యార్థిల హక్కుల కోసం, నేడు నిరుద్యోగ యువతకు ఉపాధిహక్కు కోసం ఉద్యమించటం జరుగుతుందని సత్యప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాకుచెందిన సల్మాన్‌భేగ్ ఏఐవైఎఫ్ కార్యవర్గ సభ్యులుగా, రాజ్‌కుమార్, శేఖర్, కీర్తిబాబు, సతీష్‌కుమార్‌లను రాష్ట్రసమితి సభ్యులుగా ఎన్నుకున్నారు. అదేవిధంగా యువమహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా స్వప్నను ఎన్నుకున్నట్లు తెలిపారు.వారు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితికి, సిపిఐ నాయకత్వంకు వారు దన్యవాదాలు తెలియజేశారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటాం

## అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం

**కుల్కచర్ల, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

కుల్కచర్ల మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామానికి చెందిన లేగల బచ్చయ్య అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న నిరుపేద కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి అండగా నిలిచారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి స్థానిక నాయకులతో కలిసి మృతుడి అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. ఈసందర్భంగా మాజీఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలు ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. బాధిత కుటుంబానికి అన్నివిధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయనచేసిన ఆర్థికసహాయానికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ రైతుబంధు అధ్యక్షులు రాజు,మాజీ ఎంపీటీసీ తనయుడు వెంకట్, గ్రామ అధ్యక్షులు హనుమంతు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రజక సంఘం అధ్యక్షుడిగా నాగిళ్ల లింగం

**ఆమనగల్లు, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

ఆమనగల్లు మున్సిపాలిటీ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గం నియామకంపై శనివారం రజకసంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రజకుల సమస్యలు వాటి పరిష్కారం పై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కండేయ కాలనీకి చెందిన నాగిళ్ల లింగం(చంటి) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా మద్దూరి అయోధ్య, మద్దూరి రమేష్, ప్రధానకార్యదర్శిగా నాగిళ్ల తిరుపతయ్య, సలహాదారుగా నాగిళ్ల అంజయ్య ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా నాగిళ్ల బుచ్చయ్య, నాగిళ్ల యాదయ్య, పాతకోట నరసింహను ఎన్నుకు న్నారు. కార్యదర్శులుగా సోమరాజు యాదగిరి, పాతకోట నరసింహ, మద్దూరి ఆనంద్, మద్దూరి తిరుపతి, కోశాధికారిగా శ్రీశైలం పాతకోట, ప్రచార కార్యదర్శులుగా నాగిళ్ల బాలయ్య, నాగిళ్ల యాదయ్యలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా నాగిళ్ల శేఖర్, నాగిళ్ల జగన్, పాతకోట శివ, పాతకోట శివ (టిల్లు), సోమడి రాజును ఎన్నుకున్నారు. లీగల్ అడ్వైజర్లుగా పాతకోట శీను, నాగిళ్ల లక్ష్మణ్, నాగిళ్ల నిరంజన్‌లను నియమించారు. నూతన కార్యవర్గం రజక సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

## పోలేపల్లిలో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు

**దుద్యాల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

మండలంలోని పోలేపల్లి గ్రామంలో రైతు జోగు వెంకటయ్య పొలం వద్ద 11 కేవీ విద్యుత్‌తీగ తెగి మూడురోజులుగా ప్రమాదకరంగా వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది తాత్కాలికంగా కట్టివేసి వెళ్లారని తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలకు నీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమాదం జరగకముందే లైన్‌ను పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్, బెల్టుల పంపిణీ

**శామీర్‌పేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలని,మంచి ఫలితాలు సాధించాలని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి సూచించారు. శామీర్‌పేట డివిజన్‌పరిధిలోని దేవరయాంజాల్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్‌ను, బెల్టులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు సీడ్ గణపతి..

**-ఏసిపి లక్ష్మీనారాయణ, సీతారాం, ట్రాఫిక్ సిఐ శంకరయ్య..**




ప్రముఖులకు సీడ్ గణపతిని అందజేస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే సందేశంతో షాద్‌నగర్ సీఎంఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాబోయే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని "అందరి గణపతి అంకుర గణపతి" పేరుతో మట్టి, విత్తన(సీడ్) గణపతి ప్రతిమలను పలువురు ప్రముఖులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం, సీనియర్ జర్నలిస్ట్ కేపీ, రాఘవేందర్ గౌడ్‌లతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బందికి, టైలర్లకు మట్టి మరియు సీడ్ గణపతి ప్రతిమలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సీఎంఆర్ షాపింగ్ మాల్ చేపట్టిన ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని పలువురు ప్రముఖులు, స్థానికులు తీవ్రంగా అభినందించారు.

## మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ

**దుద్యాల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

పర్యావరణ పరిరక్షణ, మట్టి వినాయక విగ్రహాల ప్రోత్సాహమే లక్ష్యంగా దుద్యాల్ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు 116 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 6-8 అంగుళాల విగ్రహాలను తయారు చేసి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు పంపిస్తూ జీవనం సాగిస్తున్న ఆయన, ప్రతి ఏటా విగ్రహాల సంఖ్యను పెంచుతూ వెయ్యి వరకు ఉచితంగా పంపిణీ చేయాలనే సంకల్పంతో ఉన్నారు. ఆయన సేవను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

## మట్టి వినాయకుడే పర్యావరణానికి శ్రీరామరక్ష

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

వినాయకచవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ భాగస్వాములై ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు స్వస్తి పలికి మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని మాజీ కౌన్సిలర్ బేతాల నర్సింగ్‌రావు, కాంగ్రెస్‌పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణలు పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్ డివిజన్ ఈడబ్ల్యుఎస్‌కాలనీ బస్టాప్ సమీపంలో స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కుంటోళ్ల యాదగిరి ఆధ్వర్యంలో కొండాపూర్ విజ్ఞాన్ మహిళాఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా బేతాల నర్సింగ్‌రావు, బర్ల రాధాకృష్ణలు మాట్లాడుతూ పండుగలపేరుతో పర్యావరణాన్ని కలుషితం చేయకుండా సంప్రదాయాలను ప్రకృతికి అనుకూలంగా కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్థానికనాయకులు శశికుమార్, కంది లింగం, భూషణం, కె.రాజేందర్ రెడ్డి, సాల్వేరు కిరణ్, బాలకృష్ణ, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవళిక, మోనిక పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానాకు పరికరాల అందజేత

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ డివిజన్ బాలాజీనగర్ బస్తీ దవాఖానకు మాజీ ఎంపిటిసి సభ్యులు నందం గణేశ్‌బాబు రిఫ్రిజిరేటర్, బీపీ మెషీన్, ట్యూబ్‌లైట్లు, సీలింగ్ ఫ్యాన్ అందజేయడం అందజేశారు. ప్రజల ఆరోగ్యసేవలకు ఉపయోగపడేవిధంగా పరికరాల వితరణ చేయడం పట్ల పలువురు ఆయనను అభినందించారు. బస్తీ దవాఖానాకు వైద్య సేవల కోసం వచ్చే రోగులకు అవసరమైన పరికరాలను ఆయన తీసుకువచ్చి వైద్యసిబ్బందికి అందజేశారు. ఈసేవా కార్యక్రమానికి సహకరించిన నందం గణేష్‌బాబుకు వైద్య సిబ్బంది, స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నల్లగారి భానుప్రకాష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపం సరిచేస్తూ కట్టర్ మిషన్ తగిలి యువకుడు మృతి

**తలకొండపల్లి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గణేష్ మండపం ఏర్పాటు కోసం కట్టర్ మెషిన్‌తో సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కట్టర్ మిషన్ తగిలి అక్కడికక్కడే యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం మండలపరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన కురకుల రాఘవేందర్(23) అనే యువకుడు శనివారం వెల్జాల్ గ్రామంలో గల హనుమాన్ టెంపుల్ సమీపంలో గణేష్‌పండుగ సందర్భంగా మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన కూర రాఘవేందర్ తన అన్న ఆంజనేయులు బాబాయ్ లక్ష్మయ్య మల్లేశులతో కలిసి మండపం కట్టెలను సరి చేస్తున్నాడు. రాఘవేందర్ మండపం పైకి ఎక్కి కట్టెలను మిషన్ కట్టర్‌తో కట్ చేస్తుండగా ప్రమాదవశత్తు గుర్రై మిషన్ జారిపడి మోచేతికి తగిలి అతని ఛాతీపైపడటంతో తీవ్రగాయాలకు గురైనాడు. తీవ్రంగా రక్తస్రావమై రాఘవేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునితల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు సిఐ జానకిరామ్ రెడ్డి తెలిపారు. గణేష్‌మండపాల వద్ద విద్యుత్ వైర్లు తదితర పరికరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాలని ఎలాంటి ప్రమాదాలకు లోను కాకుండా జాగ్రత్తలు చూసుకోవాలని సందర్భంగా ఆయన తెలిపారు.

## దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..

**-డప్పుచప్పుళ్ళు, బాజాభజంత్రీలు, డిజెసౌండ్‌లతో స్వాగతంపలికిన భక్తులు**



వినాయకుని స్వాగతిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**నందిగామ, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
గణేష్‌నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందిగామ ఒకటవవార్డులో నెలకొల్పనున్న విఘ్నేశ్వర మహారాజుకు సాయంత్రం ఒకటవవార్డు భక్తజనులు ఘన స్వాగతం పలికారు. బాజాభజంత్రీలు, ఆటపాటలమధ్య, టపాకాయలు కాలుస్తూ, ఉత్సాహవంతంగా, పండుగవాతావరణంలో భక్తిశ్రద్ధలతో స్వాగతించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా కేశంపేట మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ హాజరై పూజలు జరిపించారు. వేడుకల్లో మాజీ ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీసర్పంచ్ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, బండోనిగూడ సర్పంచ్ జట్ట కుమార్, వార్డుసభ్యులు దార సురేష్, నాయకులు కొమ్ము వెంకటయ్య, ఎర్ర శ్రీనివాస్, బుర్రి సురేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు ఎర్రగారి స్వామి, మోర్స్ నరసింహులు, మోర్స్ శ్రీను, ప్రశాంత్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఆలయాల అభివృద్ధికోసం కృషిచేస్తాం

**-నూతన సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయించిన అధికారులు**



మంబాపూర్ ఆలయకమిటీల నూతన పాలకవర్గం

**పెద్దేముల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండలం మంబాపూర్ శ్రీహనుమాన్ ఆలయ కమిటి చైర్మెన్‌గా వరప్రసాద్‌గౌడ్, డైరెక్టర్లుగా ఆర్.నర్సిములు, వడ్ల రాములు, టి.విజయకుమార్, అనితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీగోపాలక్రిష్ణ ఆలయ కమిటీ చైర్మెన్‌గా ముదిని రాములు, డైరెక్టర్లుగా తలారి రాములు, రాజవర్ధన్‌రెడ్డి, సి.నారాయన్‌రెడ్డి, ఎంగూరి లక్ష్మిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీల అధ్యక్షుల, సభ్యుల చేత ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్.ప్రణీత్, ఏఓ ప్రవీన్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీల చైర్మెన్లు వరప్రసాద్‌గౌడ్, ముదిని రాములు మాట్లాడుతూ తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహాయసహకారాలతో ఆలయాల అభివృద్ధికోసం తమవంతు కృషిచేస్తామని అన్నారు. తమకు మరోసారి ఆలయ కమిటీల చైర్మెన్లుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాల అభివృద్ధికోసం ప్రతి ఒక్కరు సహాయసహకారాలు అందించి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత, మౌలికవసతుల కల్పనతోపాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, వార్డుమెంబర్ తెరువటి నర్సిములు, గ్రామస్థులు హర్షవర్ధన్‌రెడ్డి, తాడి అంజిలయ్య, చాపల వెంకటయ్య, సంగెం చంద్రప్ప, టిల్లు, కుమ్మరి నర్సిములు, బంటారం భీములు, పూజారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీకి సంఘీభావం తెలిపిన గులాబీనేతలు



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**నందిగామ, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
అసెంబ్లీ ప్రధానప్రతిపక్ష హోదాలో ఎమ్మెల్సీగా ప్రజాసమస్యలపై పోరుబాటచేసి సస్పెన్షన్‌కుగురైన ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డిని కలిసి నందిగామ మండలకేంద్రానికిచెందిన పలువురు బిఆర్ఎస్‌నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జిల్లెల్ల జనార్దన్‌రెడ్డి, నందిగామ మాజీసర్పంచ్ వంకాయల రాంరెడ్డి(రామన్న), ప్రముఖ అడ్వకేట్ ఎం.విక్రమ్‌శర్మ తదితరులు ఉన్నారు.

## మండల వార్డుసభ్యుల ఫోరం అధ్యక్షులుగా శివగళ్ల సురేష్ ఏకగ్రీవం




వార్డుసభ్యుల ఫోరం నూతన కార్యవర్గాన్ని సన్మానించిన దృశ్యం

**నందిగామ, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
నందిగామ మండల వార్డుసభ్యుల ఫోరం అధ్యక్షులుగా శివగళ్ల సురేష్, తాలూకా అధ్యక్షులుగా కారే శ్రీకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నందిగామ మండలకేంద్రంలో రంగారెడ్డి జిల్లా వార్డుసభ్యుల ఫోరం ఇంచార్జ్ గ్యార సురేష్ ఆధ్వర్యంలో వార్డుసభ్యుల ఫోరమ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈకమిటీలో ఉపాధ్యక్షులుగా తాళ్లగూడ శ్రీశైలం, నారాయణరెడ్డి, నాగేష్, రాఘవేందర్‌గౌడ్, కాట్ల శివలింగం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్, సాధితఅనీఫ్, చేగూర్ మహమ్మద్ ఖలీద్, ప్రధానకార్యదర్శిగా శ్రావణిరాజు, గుండాల శ్రీనివాస్, ప్రచారకార్యదర్శిగా నరసింహులు, మండల కార్యదర్శిగా కల్వకోలు శేఖర్‌గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జటావత్ రాజేష్‌నాయక్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కో-ఇంచార్జి దండే మల్లేష్, ఫరూక్‌నగర్ మండలపార్టీ అధ్యక్షులు సువర్ణమురళినాయక్, కేశంపేట సాయిరాం, రాజునాయక్, ఆయాగ్రామాల వార్డుసభ్యులు తదితరులు ఉన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను జిల్లా ఇంచార్జ్ సురేష్ శాలువాలతో సన్మానించారు.

## డంపింగ్ యార్డుపై ఎమ్మెల్యే కృషి అభినందనీయం

**-అసెంబ్లీలో ప్రస్తావించడాన్ని స్వాగతించిన ఎస్ఎఫ్ఐ**

**షాద్‌నగర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డుకు సంబంధించిన జీవో నంబర్ 641ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ శాసనసభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడడాన్ని స్వాగతిస్తున్నామని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి, సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటసమితి కోకన్వీనర్ వడ్ల శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధాపూర్, కొత్తూరు, పరిసరగ్రామాల విద్యార్థులు, మహిళలు, యువత, ప్రజలతో పాటు వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు గత కొంతకాలంగా డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా సుదీర్ఘంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అసెంబ్లీలో ఈసమస్యను ప్రస్తావించడం శుభపరిణామమన్నారు. ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి జీవో నంబర్ 641ను రద్దు చేసే విధంగా కృషి చేయాలని కోరారు.

# అధ్యక్షా.. అనలేక అసెంబ్లీ మెట్లక్కని కెసిఆర్

**-దళితులపై బిఆర్ఎస్‌కు వివక్ష**
**-డిసిసి అధ్యక్షుడు ధారాసింగ్ ధ్వజం**



ఎస్టీ సెల్ అధ్యక్ష పదవికి దరఖాస్తు స్వీకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**
దళితులపై బిఆర్ఎస్ పార్టీ వివక్ష చూపుతోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధారాసింగ్ విమర్శించారు. స్పీకర్ పీఠంపై దళితుడైన ప్రసాద్‌కుమార్ కూర్చోవడాన్ని జీర్ణించుకోలేక మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీ మెట్లు ఎక్కడానికి ఇష్టపడటంలేదని ఆరోపించారు. ఆదివారం జిల్లాలోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో దిశానిర్దేశం చేసిన ధారాసింగ్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వపథకాల అమలుకు సిఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నారని కొనియాడారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేల డ్రామా రక్తి కట్టలేదని ఎద్దేవాచేశారు. దళిత స్పీకర్‌ను అవమానించి చరిత్రహీనులుగా మిగిలిపోయారని మండిపడ్డారు. అసెంబ్లీకి నల్లదుస్తులుధరించటంలో అభ్యంతరం లేదని, ఆ డ్రెస్సుపై ఉన్న పిచ్చిరాతలు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. వెయ్యిరోజుల కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారెంటీల అమలుకు కృషి జరుగుతోందని ధారాసింగ్ తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అప్పుల్లోకూరుకున్న రాష్ట్రాన్ని సిఎం రేవంత్ గట్టెక్కిస్తున్నారని కొనియాడారు. పార్టీ పటిష్టవంతం ఉండటానికి ప్రత్యేకదృష్టి సారించామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నియమించిన కొత్త మండల, పట్టణాధ్యక్షులు పూర్తిస్థాయి కమిటీలను రెండురోజుల్లోగా పూర్తిచేస్తారని చెప్పారు. కమిటీల్లో అన్నివర్గాలకు సముచితస్థానం కల్పిస్తామన్నారు. ఎస్ఐఆర్ తొలివిడత పూర్తయిందని, రెండుదశల్లో బిఎల్ఏలకు తగినశిక్షణ ఇచ్చామని డిసిసి అధ్యక్షుడు తెలిపారు. ప్రస్తుతం నోటీసులువచ్చిన ఓటర్ల జాబితాలను రూపొందించి అధిష్ఠానానికి నివేదిస్తామన్నారు. ప్రతి బూత్‌కు 10మంది సూపర్‌వైజర్లు వెళ్లి నోటీసులు వచ్చిన ఓటర్ల వివరాలు, ఇతరత్రాలోపాలను, అడ్రస్ మారినవారి వివరాలను సేకరిస్తారని వివరించారు. తమ బిఎల్ఏలు, సూపర్‌వైజర్లు సహకారం అందజేస్తారని తెలిపారు. జిల్లాలో 2.10లక్షల ఓట్లపై ఆరాతీస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్ తాండూరు నియోజకవర్గ ఇన్చార్జ్ కరణం పురుషోత్తమరావు, కొడంగల్‌నియోజకవర్గం ఇన్చార్జ్ మల్లేష్‌యాదవ్, పట్టణపార్టీ అధ్యక్షుడు బాతుల నాగరాజ్, కావలి సంతోష్, వడ్డె శ్రీనివాస్, కలాల్ చంద్రశేఖర్‌గౌడ్, పి.మహిపాల్ రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్టీ సెల్ అధ్యక్ష పదవికి దరఖాస్తులు...**
జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్ష పదవికి సీనియర్ ఆశావహులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వికారాబాద్ జిల్లా అబ్జర్వర్, సంగారెడ్డి మార్కెట్‌కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్ తెలిపారు. రంగారెడ్డి ఉమ్మడిజిల్లాల్లో కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుల దరఖాస్తుల స్వీకరణకు పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతలు అప్పగించారన్నారు. ఇప్పటివరకు ఆరు దరఖాస్తులు వచ్చాయన్నారు. వికారాబాద్ జిల్లాలో అత్యధిక గిరిజనతండాలు ఉన్న కులకచర్ల, బొంరాస్‌పేట, బషీరాబాద్, పెద్దేముల్ నుంచి అభ్యర్థులు పదవి ఆశిస్తున్నారని తెలిపారు. అధిష్ఠానానికి నివేదిస్తామని ఆయన వివరించారు.

## జూన్‌లోగా ఎలివేటెడ్ కారిడార్ పూర్తిచేయాలి

**-రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు: వైఎస్ఆర్**




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసినవ్యాఖ్యలు ప్రజలను అయోమయానికి గురిచేసేలా ఉన్నాయని బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు, ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఎద్దేవాచేశారు. బిజెపి నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ఇప్పటికే దాదాపు ఎనిమిదేళ్లు పూర్తవుతున్నా పనులు ఇంకా పూర్తికాకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. కేంద్రప్రభుత్వం నిధులు అందిస్తున్న ప్రాజెక్టులో పనులు ఇంత ఆలస్యం కావడానికి కారణమేంటో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగాచెప్పాలని డిమాండ్‌చేశారు. అసెంబ్లీలో మంత్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ మూడు పిల్లర్ల నిర్మాణానికే నెల రోజుల సమయం పడుతోందని, ఇంకా 92 పిల్లర్లు నిర్మించాల్సి ఉందని, ఇదే వేగంతో పనులు కొనసాగితే మరో నాలుగైదేళ్లు పట్టే అవకాశం ఉందని చెప్పడం ప్రభుత్వ పనితీరుకు అద్దంపడుతోందని అన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ విషయంలో ప్రజలకు హామీలు ఇస్తూ కాలయాపన చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వచ్చే జూన్‌లోగా ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, అలాచేయడంలో ప్రభుత్వం విఫలమైతే రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నైతికబాధ్యత వహిస్తూ వెంటనే తనపదవికి రాజీనామా చేయాలని ఏనుగు సుదర్శన్‌రెడ్డి డిమాండ్‌చేశారు. సమావేశంలో ఘట్‌కేసర్ మండల కార్యదర్శి రమేష్‌నాయుడు, నాయకులు పోలగోని మహేశ్‌గౌడ్, కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, బీజేవైఎం ఘట్‌కేసర్ అధ్యక్షులు సురువు అనిల్‌గౌడ్, కొత్త బాలుయాదవ్, గుండె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిని మళ్లించే డిండి లిఫ్ట్ రద్దుచేయాలి

**-సత్యాగ్రహ దీక్ష చేపట్టిన పెండింగ్ ప్రాజెక్టుల సాధన జెఎసి**



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న షాద్‌నగర్ నాయకులు

**షాద్‌నగర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని డిండి ఎత్తిపోతల పథకం పేరుతో నల్లగొండ జిల్లాకు తరలించడం అన్యాయమని, పాలమూరుప్రాంతానికి దక్కాల్సిన నీటిని ఇతరప్రాంతాలకు మళ్లించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ నాయకులు డిమాండ్‌చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా గాంధీ పార్కులో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని నల్లగొండకు మళ్లించే డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దుచేయాలని, కృష్ణా-భీమా నదుల సంగమ ప్రాంతమైన తంగిడి నుంచి 72వ జీవో ప్రకారం భారీ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలమూరు ప్రాంత హక్కులను కాపాడేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టిజి.శ్రీనివాస్, మనసాని రాంరెడ్డి, మిద్దెల సత్యనారాయణ, తీర్మాలయ్య, అర్జునప్ప, రవీంద్రనాథ్, మందారం నర్సింహులు, పసుపుల ప్రశాంత్, ఆకాష్‌నాయక్, శివతో పాటు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్సై



శాంతిసమావేశంలో మాట్లాడుతున్న దుద్యాల్ ఎస్సై శ్రీశైలం

**దుద్యాల్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
మండలంలో వినాయకచవితిని శాంతియుతవాతావరణంలో, సోదరభావంతోనిర్వహించాలని దుద్యాల్ ఎస్సై శ్రీశైలం సూచించారు. శనివారం దుద్యాల్ పోలీస్‌స్టేషన్‌లో గ్రామానికి చెందిన యువకులు, వివిధ వర్గాల ప్రజలు, గ్రామస్థులతో శాంతిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వేడుకలు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్సై కోరారు. పండుగను ప్రశాంతంగా విజయవంతంచేసేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై శ్రీశైలం సూచించారు.

## మాజీ సర్పంచ్‌పై పాత్రికేయులు ఫిర్యాదు




పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న రిపోర్టర్లు

**నందిగామ, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
నందిగామమండలం మేకగూడగ్రామానికి చెందిన మాజీసర్పంచ్ పాండు రంగారెడ్డిపై శనివారం స్థానిక రిపోర్టర్లు నందిగామ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాలుష్య కారక పరిశ్రమలపై వార్తలు రాయడం లేదని ఏకంగా ప్రింట్ మీడియాను టార్గెట్ చేసి చెప్పలేని, రాయలేని విధంగా అసభ్య పదజాలం వాడుతూ రిపోర్టర్ల మనోభావాలు దెబ్బతీసేలా వాట్సాప్‌లో రాసి గ్రూపుల్లో వేయడంపై స్థానిక రిపోర్టర్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# అక్రమ నిర్మాణాలను తొలగించాలి

**-సర్వే నంబర్ 216లోని ప్రభుత్వభూమిని గ్రామపంచాయతీకి అప్పగించాలి**
**-సర్పంచ్ బీసా కవితాకరుణాకర్‌రెడ్డి**



ఆక్రమణకు గురైన స్థలంలో వెలసిన షాపులు

**కేశంపేట, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
కేశంపేట మండలపరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలోని సర్వేనంబర్ 216లో ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించి, ప్రభుత్వ భూమిని గ్రామపంచాయతీకి అప్పగించాలని గ్రామ సర్పంచ్ బిసా కవితాకరుణాకర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వే నంబర్ 216లో 5 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు, అందులో కొంతభాగంలో దాదాపు 15మంది అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రభుత్వభూమిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అక్రమనిర్మాణాలను గుర్తించి ఆక్రమణకు గురైన ప్రభుత్వభూమిలో చేపట్టిన నిర్మాణాలను తొలగించి, భూమిని గ్రామపంచాయతీకి అప్పగించాలని ఆమె కోరారు. గతంలో బిఆర్ఎస్ పాలనలోనే చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతూ అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపిస్తూ, ప్రస్తుతసర్పంచ్ ప్రమేయంతోనే అక్రమనిర్మాణాలు కొనసాగుతున్నాయంటూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం దొంగలే దొంగదొంగ అని అరిచినట్లు ఉందని, ఇది ఎంతవరకు సమంజసమని, ఆమె అన్నారు. వాళ్లుచేసిన ఫిర్యాదుకు మా ప్రభుత్వానికి ఎలాంటి సంబంధంలేదని సర్పంచ్ తెలిపారు. 2025 ఏప్రిల్ 8న సర్వేనెంబర్ 216లోని అక్రమనిర్మాణాలు తొలగించాలని అప్పట్లోనే పోగుల నరసింహతో పాటు పలువురు గ్రామస్థులు అప్పటి తహసీల్దార్‌కు ఫిర్యాదుపత్రాన్ని అందించారని ఆమె తెలిపారు. దీనిపై అధికారులు నిర్మాణదారులకు నోటీసులుజారీచేసి మూడురోజుల్లో ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినా, ఇప్పటివరకు నిర్మాణాలు తొలగించలేదన్నారు, అక్రమంగా నిర్మాణాలు చేపట్టి అక్కడ షాపులలో బెల్ట్ షాపులు, పాఠశాల పరిసర ప్రాంతాలలో మద్యం, మాంసం ఇతరత్రా షాపులు క్రయవిక్రయాలు జోరుగా జరుపుతున్నాయని, వాటితో పాటు సాగులో ఉన్న ఎకరం15గుంటల భూమిని స్వాధీనంచేసుకుని గ్రామ పంచాయతీకి అప్పగించి, గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆమె కోరారు. వాస్తవాలను పరిశీలించి ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికారులు తగినచర్యలు తీసుకోవాలని సర్పంచ్ కవితాకరుణాకర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి నాయక్, గ్రామ వార్డుసభ్యులు పోగుల నరేష్, నర్సింహులు, కందెన సంతోష, నాగిళ్ల ప్రేమలత, కాంగ్రెస్ సీనియర్‌నాయకులు చిట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి, గుత్తి శేఖర్, శంభుల శేఖర్, పెద్దపల్లి నరసింహా రెడ్డి, కందన శివయ్య, నాగిళ్ల యాదయ్య, కందన యాదయ్య, అంతారం రాములు, గ్రామ సీనియర్ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**-దౌల్తాబాద్ ఎస్సై వేణుకుమార్**




సమావేశంలో మాట్లాడుతున్న దౌల్తాబాద్ ఎస్సై వేణుకుమార్

**దౌల్తాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించి డీజేలు వాడితే కఠిన చర్యలు తప్పవని దౌల్తాబాద్ ఎస్సై వేణుకుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ నిర్వాహకులు, వివిధమతాల పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆయాపార్టీల నాయకులతో శాంతిసమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ శాఖ రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదుచేసుకొని పోలీస్ వారికి సహకరించాలని అన్నారు. ప్రతి మండపం దగ్గర నిర్వాహకులు పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని ఫోలీస్ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి సంతకం చేస్తారన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనంవరకు పూర్తిబాధ్యత నిర్వాహకులు తీసుకోవాలన్నారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100కుగాని లేదా స్థానిక ఫోలీసులకుగాని సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని గణేష్ ఉత్సవకమిటీ సభ్యులు, యువజనసంఘం సభ్యులు, వివిధమతాల పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆయాపార్టీల నాయకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులు ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకువెళ్లాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న షీటీం డిసిపి ఉషారాణి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
విద్యార్థినులకు ఎక్కడైనా వేధింపులు ఎదురైతే ధైర్యం ఎదుర్కోవాలని మల్కాజ్‌గిరి ఉమెన్ సేఫ్టీ డిసిపి టి.ఉషారాణి అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మల్కాజ్‌గిరి సిపి సుమతి ఆదేశాల మేరకు మీసురక్షలో భాగంగా షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ధీర కార్యక్రమం ద్వారా మహిళలు, బాలికల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ, మహిళల భద్రత, స్వీయ రక్షణ, సైబర్ నేరాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఉమెన్ సేఫ్టీ డిసిపి టి.ఉషారాణి విచ్చేసి మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం షీటీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎవరైనా అసభ్యంగా, అనుచితంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీటీం మొబైల్‌నంబర్ 8712662111కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఆత్మరక్షణ కోసం చేసే కరాటే, కుంగ్‌ఫూ వంటి స్టంట్స్‌ను ధీర శిక్షకులు ప్రదర్శించి తెలియజేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మహిళలపై జరిగే వేధింపులు, స్ట్రీట్ హరాస్‌మెంట్, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో డిసిపి ఉషారాణి మొక్కలు నాటి నీరు పోశారు. షీటీం ఇన్‌స్పెక్టర్ రజితరెడ్డి, ఉమెన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్లు కీసర నాగరాజు, అంజయ్య, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, ఎస్ఐ ఎ.శేఖర్, బుద్వేల్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.పాండురంగాశర్మ, మహేంద్రాహిల్స్ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి, జగద్గిరిగుట్ట సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ జె.రేణుక, కరాటే మాస్టర్ వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**-షాబాద్ ఇన్స్పెక్టర్ లక్ష్మిరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న షాబాద్ ఇన్స్పెక్టర్ లక్ష్మిరెడ్డి

**షాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని షాబాద్ ఇన్స్పెక్టర్ లక్ష్మిరెడ్డి అన్నారు. శనివారం స్టార్ గార్డెన్ లో వినాయకచవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజాప్రతినిధులు, ఉత్సవకమిటీ సభ్యులు, ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలన్నారు. వినాయక చవితి. దసర, దీపావళి పండుగలను రానున్న నేపథ్యంలో ప్రజలు కలిసి మెలసి ఉండాలని సూచించారు. గ్రామానికి ఒక్క వినాయకుడినే పెట్టాలన్నారు. అది కూడా చిన్నగా ఉండేలా చూడాలన్నారు. ఎక్కడో జరిగిన సంఘటనలకు మన గ్రామాల ప్రజలు పట్టించుకోనవసరం లేదన్నారు. డిజైలు, రికార్డింగ్ కార్యక్రమాలు నిషేదమని స్పష్టం చేశారు. నిమజ్జనం కూడా ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. అందరు శాంతియ త వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఇన్స్పెక్టర్ రవీందరెడ్డి, ఎస్సైలు విజయ్, చెన్నారెడ్డి, ఏఈ కోటేశ్వరరావు, అర జాజా, ఆరిహ గ్రామ్యాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఉత్సవకమిటీ సభ్యులు. నాయకులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 641 రద్దుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి

**-సిపిఎం మండల కార్యదర్శి ఈశ్వర్‌నాయక్**

**షాద్‌నగర్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డును జీవో నెంబర్ 641 వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ శాసనసభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడడాన్ని స్వాగతిస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట సమితి కో కన్వీనర్ ఈశ్వర్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్ధాపూర్, కొత్తూర్ మరియు దాని పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, యువతతో పాటు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు గత కొంతకాలంగా ఈ డంపింగ్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా సుదీర్ఘమైన ఆందోళనలుచేస్తున్నారని గుర్తుచేశారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవచూపి ముఖ్యమంత్రితో మాట్లాడి జీవో నెంబర్ 641ను రద్దుచేసే విధంగా కృషిచేయాలని వారు కోరారు. అదే విధంగా ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుచేయడం వల్ల పర్యావరణం పూర్తిగా దెబ్బతినడమే కాకుండా, భూగర్భజలాలు తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. స్థానిక వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు, ప్రజలు భయంకరమైన రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వారు అన్నారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటం ఏ ఒక్క రాజకీయ పార్టీకో పరిమితమైంది కాదని, ఇది ప్రజల జీవన హక్కు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం సాగుతున్న ప్రజా ఉద్యమని స్పష్టంచేశారు. ప్రజల సంక్షేమం కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు అన్ని ప్రజా సంఘాలు ఏకతాటిపై వచ్చి పోరాటం చేయాలని వారు కోరారు.